www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 10 | వెల రూ.5.00
Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 97 | బుధవారం | 18 సెప్టెంబర్, 2024

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

# నియంతృత్వ సంకెళ్లు తెంచాం

## నియంత పాలనలో మగ్గిన తెలంగాణ
## తెలంగాణ అంటే త్యాగం.. బలిదానం..




- మాది ఫామ్‌హౌస్ పాలన కాదు..
- కుటుంబ పాలన అంతకంటే లేదు
- లోతైన ఆలోచనతోనే ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాం
- తెలంగాణ హక్కుల సాధనకు ఎన్ని సార్లు అయినా ఢిల్లీకి వెళ్తాం..
- ఢిల్లీ మరో దేశంలో లేదు..
- హైదరాబాద్ ఫ్లడ్ సిటీగా మారడానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణం
- కేరళలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకూడదనే హైడ్రా ఏర్పాటు చేశాం
- ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- గన్ పార్కు వద్ద అమరులకు నివాళులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 :** పదేండ్ల నియంతృత్వ పాలన సంకెళ్లను తెంచామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రజాపాలనదిన వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. తొలుత సీఎం రేవంత్ రెడ్డి గన్ పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. 'ఓ నిజాము పిశాచమా... కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని..' అన్న దాశరథీ కవితతో తన ప్రసంగాన్ని మొదలు పెట్టారు. తెలంగాణ అస్థిత్వం అంటే.. కుటుంబ పాలన కాదని, తెలంగాణలో పాలన బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. లోతైన ఆలోచన చేసి సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరపాలని నిర్వహించామని స్పష్టం చేశారు.

మిగతా 2 లో

## త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు
- భూమి లేని నిరుపేదల ఖాతాల్లో 12 వేలు వేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

..3లో

## పటేల్ కృషితోనే విమోచనం
- ఆపరేషన్ పోలోతో విముక్తి కల్పించిన ఉక్కు మనిషి
- విమోచనోత్సవాలపై ఇంతకాలం రాజకీయం
- పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించిన కిషన్ రెడ్డి

.. 2లో



## విలీనం కానేకాదు!
- చరిత్రను కించపరచవద్దు
- తెరమరుగు చేసే ప్రసక్తే లేదు
- మజ్లిస్‌కు భయపడి ప్రజాపాలన
- ఆ కుటుంబానికి రేవంత్ దాసోహం
- త్వరలోనే అధికారికంగా నిర్వహిస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

..2లో





## అగ్‌లే బరస్ తు జల్దీ ఆ..

ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన ప్రక్రియ ముగిసింది. మంగళవారం ఉదయం ప్రారంభమైన శోభాయాత్ర వేలాది భక్తుల సందడి మధ్య మధ్యాహ్నానికి హుస్సేన్ సాగర్ వద్దకు చేరుకుంది. ఎన్టీఆర్ మార్గ్ లోని 4వ నెంబర్ క్రేన్ వద్ద బడా గణేష్ నిమజ్జనం పూర్తైంది. గణపతి నిమజ్జనాన్ని తిలకించేందుకు హుస్సేన్ సాగర్ వద్దకు భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో ట్యాంక్‌బండ్ జనసంద్రంగా మారిపోయింది. గణపతి బప్పా మోరియా నినాదాలతో ట్యాంక్ బండ్ పరిసరాలు మోతమోగుతున్నాయి. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జన వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని చూసి ప్రజలు కేరింతలు కొట్టారు. ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం సెక్రటేరియట్ కు వెళ్లారు.

## ప్రధాని మోడీతో రాజకీయ స్థిరత్వం
- దేశంలో అభివృద్ధి పరుగులు
- రైలు ప్రమాదాల వెనక కుట్రలు కనిపెడతాం
- మోడీ వందరోజుల పాలనపై బుక్‌లెట్ విడుదల
- హోంమంత్రి అమిత్‌షా

..2లో



## బుల్డోజర్ చర్యలను ఆపండి
అక్టోబర్ 1 వరకు ఆస్తులు కూల్చొద్దు
సుప్రీం ధర్మాసనం సిరియస్ వార్నింగ్

..2లో

### ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవు
స్పష్టం చేసిన కమిషనర్ రంగనాథ్

..2లో



## కాంగ్రెస్ అప్పలను బీఆర్ఎస్ ఖాతాలో..
- కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది
- మండిపడ్డ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

..3లో

## ములుగు జిల్లాలో తొలి కంటెయినర్ స్కూల్
లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సీతక్క

ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే
## రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ
- చేతనైతే ఇచ్చిన హామీలు అమలు చేయండి
- రైతుబంధు వెంటనే ఇచ్చి నిజాయితీ చూపండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో జెండా ఆవిష్కరణ
- తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

..3లో



# రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రాణి కుముదిని



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 :** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాణి కుముదిని నియమితులయ్యారు. ప్రస్తుత కమిషనర్ పార్థసారధి పదవీకాలం ఈ నెల ఎనిమిదో తేదీతో ముగియడంతో ఆయన స్థానంలో రాణి కుముదిని నియమిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. మూడేళ్లపాటు రాణి కుముదిని ఎస్ఈసీగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 1988 బ్యాచ్‌కు చెందిన కుమిదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర సర్వీసుల అనంతరం తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు చేపట్టారు. 2023 ఎన్నికలకు ముందు పదవీ విరమణ చేశారు. అప్పటి కెసిఆర్ ప్రభుత్వం ఆమెని తిరిగి అదే హోదాలో కొనసాగించింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నూతన ఎస్ఈసీ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

# పటేల్ కృషితోనే తెలంగాణకు విమోచనం

- ఆపరేషన్ పోలోతో విముక్తి కల్పించిన ఉక్కు మనిషి
- విమోచనోత్సవాలపై ఇంతకాలం రాజకీయం
- పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించిన కిషన్ రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్17 :** నియంతృత్వ నిజాం నుంచి ప్రజలకు విమోచన లభించిన రోజు ఇది అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరేడ్ మైదానంలో జాతీయ జెండాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. అమరజవాన్ల స్తూపం, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు. నిజాంపై వేల మంది ప్రజలు వీరోచితంగా పోరాటం చేశారని కొనియాడారు. ప్రజల బలిదానాలు, త్యాగాల తరువాత తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. రజకార్ల మెడలు వంచడంలో దివంగత మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్‌ది సాహసోపేత పాత్ర అని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రజాకార్ల వారసత్వ పార్టీకి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కొమ్ముకాస్తున్నాయని దుయ్యబట్టారు. భర్కత్ పురలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. హైదరాబాద్ విమోచనానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని కేంద్రహోంమంత్రి అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్‌కు మాత్రం వెంటనే రాలేదన్నారు. నిజాం, రజాకార్ల ఆగడాలకు.. ఆపరేషన్ పోలో ద్వారా పటేల్ ముగింపు పలికారనికొనియాడారు. పటేల్ పోలీస్ యాక్షన్‌తో నిజాం సైన్యం తలవంచిందన్నారు. పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలోతో నిజాం తలవంచారని..13 నెలల తర్వాత తెలంగాణకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. పటేల్ లేకపోతే హైదరాబాద్ విమోచనానికి మరింత సమయం పట్టేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నిజాం పాలన నుంచి విముక్తి లభించి 75 ఏళ్లు గడిచినా ఎవరూ విమోచన దినోత్సవ వేడుకలు జరపడానికి ముందుకు రాలేదని కేంద్రమంత్రి అన్నారు. ఇన్నాళ్లూ ఈ వేడుకలు నిర్వహించడానికి ఏ ప్రభుత్వమూ సాహసించలేదని పేర్కొన్నారు. విమోచన దినోత్సవం నిర్వహించేందుకు అన్ని పార్టీలు భయపడ్డాయని తెలిపారు. ఈ వేడుకలను వైభవంగా నిర్వహించాలని ప్రధాన మంత్రి మోదీ ప్రకటన చేసిన తర్వాతే మిగతా పార్టీలు నిద్రలో నుంచి మేల్కొన్నాయని వ్యాఖ్యానించారు. నిజాం, రజాకార్ల ఆగడాలకు ఆపరేషన్ పోలో ద్వారా సర్దార్ పటేల్ ముగింపు పలికారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక పోరాటంలో ఎందరో ప్రాణాలు అర్పించారు. హైదరాబాద్ స్వాతంత్ర్యం కోసం ఎందరో సైనికులు ప్రాణాలు అర్పించారని తెలిపారు. రజాకార్లు గ్రామాల్లో హత్యలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం పాలనలో మహిళలపై లెక్కలేనన్ని ఆగడాలు జరిగాయన్నారు. జలియన్ వాలాబాగ్ తరహా ఘటన గుండ్రాంపల్లిలో జరిగిందని.. ఆ ఘటనలో ఎంతో మంది నేలకొరిగారని పేర్కొన్నారు. తెలంగాణను పాలించిన పార్టీలన్నీ ఓటు బ్యాంకు కోసమే పనిచేశాయన్నారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదన్నారు. విమోచనోత్సవాలతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ పరిసరాలు శోభాయమానంగా మారాయి. పోలీసుల కవాతులు, వీవీఐపీల రాక, కళాకారుల నృత్యాలతో విమోచన వేడుకలు నభూతో నభవిష్యత్ అన్నట్లుగా సాగాయి. వేడుకల్లో కళాకారులు నృత్యాలతో అలరించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రాలంకరణలో ప్రదర్శనలు ఇచ్చారు. మూడు రాష్ట్రాల కళారూపకాల ప్రదర్శనతో పరేడ్ గ్రౌండ్స్ పరిసరాలు మార్మోగాయి. డప్పుదరువులు, ఒగ్గు కథలతో కళాకారులు హోరెత్తించారు.



# విమోచనమే .. విలీనం కానేకాదు!

**చరిత్రను కించపరచవద్దన్న బండి**

**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** పరేడ్ గ్రేండ్స్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించామని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. బీజేపీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఈ రోజు విమోచన దినోత్సవమే పునరుద్ఘాటించారు. విమోచన దినోత్సవం జరపక పోవడం తెలంగాణ ప్రజలను అవమాన పరచడమేనని అన్నారు. చరిత్రను తెరమరుగు చేసే ప్రసక్తే లేదన్నారు. మజ్లిస్ నేతలకు భయపడి తెలంగాణ ప్రభుత్వం ప్రజాపరిపాలన దినోత్సవం జరుపుతోందని బండి సంజయ్ ఆరోపించారు. తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలు చేస్తుందన్నారు. ఒవైసీ కుటుంబానికి రేవంత్ కూడా దాసోహం అయ్యారని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించిన తర్వాతనే కదలిక వచ్చిందని అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో భాగంగా.. భాజపా రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పార్టీ నేతలు నివాళులు అర్పించారు. అనంతరం దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది తర్వాత తెలంగాణకు నిజాం పాలన నుంచి విముక్తి లభించిందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ ఏడాదిపాటు ప్రజలు ఎంతో నరకయాతన అనుభవించి, భరించారని తెలిపారు. ఆనాడు తెలంగాణ మహిళలపై నిజాం సంస్థానం చేసిన అకృత్యాలు అత్యంత ఘోరమైనవని ఆయన వాపోయారు. తరవాత నాటి భారతదేశ హోంమంత్రి పటేల్ సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలోను ప్రారంభిస్తే, 17న ప్రజలకు విముక్తి లభించిందని, దీన్నే విమోచన దినోత్సవంగా నేడు జరుపుకుంటున్నామన్నారు. ఈ పోరాటంలో చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్యలాంటి ఎందరో పోరాడారన్నారు. వీరి త్యాగాల ఫలితమే ఈ తెలంగాణ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని భాజపా ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసిందని బండి సంజయ్ అన్నారు. ఎందరో త్యాగాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణలో ఇంత ఘోరమైన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులర్పించారు. హైదరాబాద్‌ను పాకిస్థాన్‌లో కలపాలని నిజాం చూశారు. దేశ సమైక్యతకు సర్దార్ బలమైన నిర్ణయాలు తీసుకొన్నారు. విలీనం విషయంలో వివాదాలు అవసరం లేదు. దేశ సమైక్యత కోసం అందరూ ముందుకు కదలాలని అన్నారు.

# నియంతృత్వ సంకెళ్లు తెంచాం..

**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** గడిచిన పదేళ్ల నియంత పాలనలో తెలంగాణ మగ్గిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ అస్థిత్వం అంటే.. కుటుంబ పాలన కాదన్న రేవంత్ రెడ్డి, తెలంగాణలో పాలన బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. కాలు కదపకుండా ఇంట్లో సేదదీరడానికి తాను ఫాంహౌస్ సీఎంను కాదు.. పనిచేసే ముఖ్యమంత్రిని అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐక్యత, సమైక్యతను దెబ్బతీసేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. లోతైన ఆలోచన చేసి సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరపాలని నిర్వహించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో రాజకీయం లేదని, ఇందులో రాజకీయ ప్రయోజన కోణంలో సెప్టెంబర్ 17ను చూడటం అవివేకమవుతుందని తెలిపారు. ఇక తన ఢిల్లీ పర్యటనపై విమర్శలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. తన స్వార్థం కోసమో, వ్యక్తిగత పనుల కోసమో ఢిల్లీ వెళ్లడం లేదని తెలిపారు. తెలంగాణ హక్కుల సాధన కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళ్తానని రేవంత్ ప్రకటించారు. ఢిల్లీ భారతదేశంలోనే ఉందని, మరో దేశంలో లేదన్నారు. కేంద్రం నుంచి రావలసిన ప్రతి పైసా తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రజాపాలనదిన వేడుకల్లో సీఎం రేవంత్ పాల్గొన్నారు. అక్షరవీరులు ఒకవైపు, సాయుధ యోధులు మరో వైపు సాగించిన పోరాటంలో 76 ఏళ్ల క్రితం హైదరాబాద్ రాజ్యం స్వేచ్ఛ పొందిందని సీఎం రేవంత్ గుర్తు చేసుకున్నారు. ఒక ప్రాంతానికో.. ఒక కులానికో, ఒక మతానికో వ్యతిరేకంగా జరిగిన పోరాటం కాదన్న సీఎం.. సెప్టెంబర్ 17 ను కొంతమంది వివాదాస్పదం చేస్తున్నారన్నారు. లేక్‌సిటీగా ఉన్న హైదరాబాద్ ఫ్లడ్ సిటీగా దిగజారడానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని సీఎం రేవంత్ ఆరోపించారు. కేరళలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూసేందుకు హైడ్రా ఏర్పాటు చేశామని ప్రకటించారు. హైడ్రా ఒక పవిత్ర కార్యమని, ఇందులో ఎటువంటి స్వార్థమూ లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ భవిష్యత్‌కు హైడ్రా గ్యారెంటీ ఇస్తుందని, ఇది తన భరోసా అని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రజాపాలన' దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. తొలుత సీఎం రేవంత్ రెడ్డి గన్ పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత 'ఓ నిజాము పిశాచమా... కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని..' అన్న దాశరథీ కవితతో తన ప్రసంగం ప్రారంభించారు. తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానం అని.. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు పోరాడారని అన్నారు. '4 కోట్ల తెలంగాణ ప్రజలకు ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు. నిజాం నిరంకుశ రాజును, ఆనాటి రాచరిక వ్యవస్థను మట్టి కరిపించి తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన చారిత్రాత్మక ఘట్టం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ గడ్డపై ఆవిష్కృతమైంది. ఇది ప్రాంతానికో, ఒక కులానికో, ఒక మతానికో వ్యతిరేకంగా జరిగిన పోరాటం కాదు. ఒక జాతి తన స్వేచ్ఛ కోసం, ఆత్మగౌరవం కోసం రాచరిక పోకడపై చేసిన తిరుగుబాటు. నాటి సాయుధ పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారు. ఆనాటి పోరాటంలో ప్రాణాలు వదిలిన అమరవీరులకు ఈ సందర్భంగా ఘన నివాళి.' అని సీఎం పేర్కొన్నారు.







# మోడీతో రాజకీయ స్థిరత్వం

- దేశంలో అభివృద్ధి పరుగులు
- రైలు ప్రమాదాల వెనక కుట్రలు కనిపెడతాం
- మోడీ వందరోజుల పాలనపై బుక్‌లెట్ విడుదల
- హోంమంత్రి అమిత్ షా వెల్లడి



**న్యూఢిల్లీ,సెప్టెంబర్17 :** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు ఏర్పడి వంద రోజులు దాటిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ..మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకువచ్చిందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని, ప్రజలు వాటికి సాక్ష్యాలుగా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. అమిత్ షాతో పాటు మంత్రులు అశ్వినీ వైష్ణవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 100 రోజుల పాలనలో సాధించిన ప్రగతిపై రూపొందించిన ఓ బుక్‌లెట్‌ను అమిత్ షా ఆవిష్కరించారు. పదేళ్ల అభివృద్ధి, భద్రత, సంక్షేమం తర్వాత ప్రజలు మూడవ సారి బీజేపీ మిత్ర కూటమిని మరోసారి ఆశీర్వదించారని ఆయన పేర్కొన్నారు. గడిచిన 60 ఏళ్లలో ఇలా జరగడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. ఇది దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకువచ్చిందని, పాలసీలను సమర్థవంతంగా అమలు చేశామన్నారు. ప్రధాని మోదీ తీసుకువచ్చిన కొత్త విద్యా విధానంలో.. ప్రాచీన, ఆధునిక విద్యా వ్యవస్థలు ఉన్నట్లు తెలిపారు. ఆ విద్యా వ్యవస్థ ప్రాంతీయ భాషలను గౌరవిస్తుందని హోంమంత్రి తెలిపారు. వంద రోజుల పాలన సమయంలో.. సుమారు మూడు లక్షల కోట్ల ప్రాజెక్టులను ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు. గత పదేళ్లలో ఇండ్లు, టాయిలెట్లు, గ్యాస్ కనెక్షన్లు, త్రాగునీరు, విద్యుత్తు, ఉచిత ఆహార ధాన్యాలు, ఆరోగ్యం అందించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల వరకు దేశంలో ఇండ్లు లేని వారు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయనున్నట్లు అమిత్ షా తెలిపారు. ఇకపోతే దేశంలో వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాల వెనక ఏదైనా కుతంత్రాలు దాగి ఉంటే వెలికి తీస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. కుట్రలు ఎక్కువ రోజులు దాగి ఉండవని వ్యాఖ్యానించారు. 1.10 లక్షల కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్ పరిరక్షణకు ప్రభుత్వం అతి త్వరలోనే కీలక చర్యలు తీసుకొంటుందని వెల్లడించారు. ప్రభుత్వ పనితీరును ఆయన వివరిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రైల్వే భద్రతపై ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఈ అంశంపై తాను చర్చించానని అమిత్‌షా పేర్కొన్నారు. రైల్వే ప్రమాదాల విషయానికి వస్తే వాటి మూలకారణాలపై దర్యాప్తు చేస్తాం. కారణం ఏదైనా.. ప్రభుత్వం వీటిపై దృష్టి పెడుతుంది. ఇది కుట్ర అయితే.. ఎక్కువ కాలం కొనసాగదు. ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిచేస్తాం. ఇటీవల ఘటనలను దృష్టిలో పెట్టుకొని బలమైన ప్రణాళికను సిద్ధం చేసుకొంటున్నాం. మోదీ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో 38 రైలు ప్రమాదాలు జరిగాయంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను అమిత్‌షా కొట్టి పారేశారు. అవి మొత్తం చిన్న ఘటనలని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరిస్తున్నట్లు ప్రజలు గుర్తించారన్నారు. ఈ 100 రోజుల్లోనే ఎనిమిది కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోద ముద్రవేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులతో దాదాపు 4.42 కోట్ల మానవ పనిదినాల ఉపాధి లభిస్తుందని కేంద్ర హోం మంత్రి వెల్లడించారు. ఇటీవల కొందరు దుండగులు పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి రైలు ప్రమాదాలు జరిగేలా దుశ్చర్యలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ తరహాలో 24 ఘటనలు జరిగాయని భారత రైల్వే కొన్నాళ్ల క్రితం నివేదికలో వెల్లడించింది. అందులో ఆగస్టులో 15, సెప్టెంబర్‌లో 3 ఘటనలను గుర్తించారు. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్, తర్వాత పంజాబ్, ఝార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణలో ఈ కుట్రపూరిత యత్నాలు బయటపడ్డాయి. ఆగస్టులో కాన్పూర్ సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ 20 బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌పై ఉంచిన ఓ వస్తువు కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంపై అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత కాన్పూర్, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోను ఈ తరహా ఘటనలు వెలుగుచూశాయి.

# బుల్డోజర్ చర్యలను ఆపండి

**అక్టోబర్ 1 వరకు ఆస్తులు కూల్చొద్దు**
**సుప్రీం ధర్మాసనం సిరియస్ వార్నింగ్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :** దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న బుల్డోజర్ చర్యలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 1వ తేదీ వరకు కోర్టు అనుమతి లేకుండా దేశంలో ఎక్కడా ఆస్తులను కూల్చరాదని ధర్మాసనం ఆదేశించింది. అయితే ఈ ఉత్తర్వు పబ్లిక్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఇతర వాటిపై అనధికారిక నిర్మాణాలకు మాత్రం వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరాలకు పాల్పడిన వ్యక్తుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని అధికారులు కూల్చివేస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించి తాజా ఉత్తర్వు జారీ చేశారు. ఇదిలా ఉంటే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న బుల్డోజర్ సంస్కృతిని ఇప్పటికే సుప్రీంకోర్టు ఖండించింది. ఇలాంటి చర్యలను గొప్పగా చేయొద్దని ప్రభుత్వాలకు వార్నింగ్ ఇచ్చింది. అయితే ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌ను కూడా పిలవవచ్చని హెచ్చరించింది. మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూ కశ్మీర్, హర్యానాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఈసీకి నోటీసీలు ఇస్తామని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ రాష్ట్రాల్లో చాలా చోట్ల బీజేపీ అధికారంలో ఉంది. అదే సమయంలో బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపు విషయంలో మాత్రం తమ ఆదేశాలు వర్తించవని తేల్చిచెప్పింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, సీయూ సింగ్ వాదనలు వినిపించారు. ఇప్పటికే సెప్టెంబర్ 2వ తేదీన జరిగిన వాదనల్లో దేశంలో ఎక్కడా ఈ తరహా చర్యల్లో మార్గదర్శకాలను పాటించడంలేదని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన పిటిషనర్‌గా జామత్ ఉలేమా హింద్ వ్యవహరిస్తోంది. కూల్చివేతలకు ముందు కనీసం 40-60 రోజుల ముందుగా నోటీసులు జారీ చేయాలని, చట్ట వ్యతిరేక కూల్చివేతలకు సదరు అధికారులను బాధ్యులను చేయాలని ఆ సంస్థ సుప్రీంకు నివేదించింది. యూపీ ప్రభుత్వం పక్షాన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

# ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవు

**స్పష్టం చేసిన కమిషనర్ రంగనాథ్**



**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** బుల్డోజర్ న్యాయాన్ని ఆపాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని నేరస్థులు, నిందితుల ఆస్తుల కూల్చివేతలకు మాత్రమే సుప్రీం ఆదేశాలు వర్తిస్తాయన్నారు. చెరువు లు, నాలాలు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి నిర్మించిన వాటిని మాత్రమే హైడ్రా కూల్చివేస్తుందని స్పష్టం చేశారు. నేరస్థులు, నిందితులకు సంబంధించిన ఎలాంటి ఆస్తుల జోలికి హైడ్రా వెళ్లడం లేదని రంగనాథ్ పేర్కొన్నారు. బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపులో తమ ఆదేశాలు వర్తించవన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రంగనాథ్ గుర్తుచేశారు. హైడ్రా కూల్చివేతలపై ఇటీవల పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. హైడ్రా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలు చేస్తుందని, న్యాయం చేయాలంటూ కోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలు రావడంతో రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని స్పష్టం చేశారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
బుధవారం
18 సెప్టెంబర్ 2024


# ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా

## ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని సూచన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్17 :** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన ఆయన.. తన రాజీనామా లేఖను సమర్పించారు. ఆయన వెంట ఆప్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన ఆతిషీ, ఇతర మంత్రులు, ఆప్ నేతలు ఉన్నారు. ఆప్ ఎల్పీగా ఆతిషీని ఎన్నుకున్నట్లు కేజ్రీవాల్ ఎల్జీకి తెలిపారు. కేజ్రీవాల్ రాజీనామాను ఎల్జీ ఆమోదించాక.. త్వరలోనే ఢిల్లీ నూతన సీఎంగా ఆతిషీ ప్రమాణస్వీకారం చేయనున్నారు. అప్పటి వరకు ఆపద్ధర్మ సిఎంగా ఉండాలని కోరారు. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీ లాండరింగ్ ఆరోపణలతో అరెస్టైన కేజ్రీవాల్కు ఇటీవలే సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. తీహార్ జైలు నుంచి విడుదలైన ఆయన.. తన పదవికి రాజీనామా చేస్తానని ఆదివారం సంచలన ప్రకటన చేశారు. ఢిల్లీ ప్రజలు తనకు నిజాయతీపరుడినని సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిలో ఉండనని స్పష్టం చేశారు. మధ్యంతర ఎన్నికలకు వెళ్లి తన విశ్వసనీయతను పరీక్షించుకుంటానని చెప్పారు.



# కాంగ్రెస్ అప్పులను బీఆర్ఎస్ ఖాతాలో వేశారు

## కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది
## మండిపడ్డ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

**మెదక్, సెప్టెంబర్ 17 :** కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అప్పును తెలివిగా బీఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలో వేశారని రేవంత్‌రెడ్డి సర్కారుపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మెదక్‌లో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందంటూ సీఎం రేవంత్, కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా తెలంగాణ అప్పులు- వాస్తవాలను మరోసారి ప్రభుత్వం తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. డిసెంబర్ 23న విడుదల చేసిన శ్వేతపత్రంలో నాలుగు రకాల అప్పులు చూపించారని.. రెండు రకాల అప్పులు ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరం లేదని, శ్వేత పత్రలో క్లియర్‌గా మెన్షన్ చేశారన్నారు. మీరు ఇచ్చిన శ్వేతపత్రంలోనే గవర్నమెంట్ హామీలేనివి, గవర్నమెంట్ కట్టనివి రూ. 59, 414 కోట్లు అని చెప్పారని గుర్తు చేశారు. గవర్నమెంట్ హామీ ఉండి, గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేనివి రూ. 95,462కోట్లు అని చెప్పారని.. అంటే ప్రభుత్వం కట్టాల్సిన అవసరం లేని అప్పులు 1,54,876కోట్లు అని గుర్తు చేశారు. సీఎం చెప్పిన రూ. 6,71,757 కోట్ల అప్పుల నుంచి గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేని రూ. 1,54,876 కోట్లను తీసేస్తే మిగిలిన అప్పు రూ. 5,16,881 కోట్లు మాత్రమేనన్నారు. ప్రభుత్వం శ్వేతపత్రంలో రాష్ట్రం ఏర్పడే నాటికి రూ. 72,658 కోట్ల అప్పు తెలంగాణకు గత ప్రభుత్వాల నుంచి సంక్రమించింది అని చెప్పారని.. రూ. 5,16, 881 కోట్ల ప్రభుత్వం కట్టాల్సిన అప్పు నుంచి వారసత్వంగా వచ్చిన రూ. 72,658 కోట్ల అప్పును తీసివేస్తే రూ. 4,44,223 కోట్ల అప్పు ఉంటుందన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు ఎస్పీవీ (స్పెషల్ పర్పస్ వెహికిల్స్)ల ద్వారా గత ప్రభుత్వాలు చేసిన అప్పు రూ. 11, 609కోట్లు అని తెలిపారు. ఈ మొత్తాన్ని కూడా రూ. 4,44,223 కోట్ల నుంచి తీసి వేస్తే.. రూ. 4,32,614 కోట్లు మిగులుతుందన్నారు. శ్వేతపత్రంలో ఎఫ్ఆర్‌బీఎం అప్పులు మార్చి 31, 2024 వరకు ఉన్న బ్జడెట్ ఎస్టిమేట్స్‌ను తీసుకున్నారని.. శ్వేతపత్రం డిసెంబర్‌లోనే విడుదల చేశారనేది మనందరికీ తెలిసిందేనన్నారు. ఈ శ్వేతపత్రంలో తెలివిగా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రూ. 6,115 కోట్ల అప్పును బీఆర్ఎస్ ప్రభుత్వంలో జమ చేశారని.. కాంగ్రెస్ తీసుకున్న రూ. 6,115 కోట్లను.. రూ. 4,32,614 నుంచి తీసివేస్తే రూ. 4,26,499 కోట్ల అప్పు మిగులుతుందన్నారు. అంటే తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ. 4,26,499 కోట్లు మాత్రమేనన్నారు. కానీ, పదే పదే రూ. 6,71,757 కోట్లు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రూ. 4.26 లక్షల కోట్లలో ఉదయం స్కీం రూ. 9వేల కోట్లు, 2019-20 15వ ÷నాన్స్ కమిషన్ గ్రాంట్లను కేంద్ర ప్రభుత్వం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పు రూపంగా రూ. 2,459కోట్ల అప్పు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. దీంతో పాటు కొవిడ్ సందర్భంలో గ్రాంట్ల రూపంలో రాష్ట్రాలను ఆదుకోకుండా, అప్పులు తీసుకునే స్థితికి కేంద్రం నెట్టిందని.. అందువల్ల రూ. 17,558 కోట్ల అప్పు చేయాల్సిన అనివార్య పరిస్థితి తెలంగాణకు వచ్చిందని తెలిపారు. అదే విధంగా కోవిడ్ కారణంగా 2021-22 సంవత్సరంలో జీఎస్డీపీలో ఒకశాతం అధికంగా అప్పు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఆ మొత్తం రూ. 10,784 కోట్లు అని.. తెలంగాణ రాష్ట్రం అనివార్యంగా రూ. 41,159 కోట్ల అప్పు తీసుకోవాల్సిన పరిస్థితికి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, కొవిడ్ తో నెట్టబడిందన్నారు. అనివార్యంగా చేయాల్సిన అప్పు అని హరీశ్‌రావు వివరించారు.

# పటేల్‌కు బీజేపీకి ఏమి సంబంధం

## టీపీసీసీ ఛీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్
## గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 :** తెలంగాణ విలీనం అయినప్పుడు బీజేపీ పుట్టనే లేదని, బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తుందని టీపీసీసీ ఛీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. గాంధీభవన్ వద్ద తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ విలీనం గురించి మాట్లాడే హక్కు బీజేపీకి లేదన్నారు. పటేల్‌కు బీజేపీకి ఏం సంబంధం. బీజేపీ తన నాయకుడిగా చెప్పుకుంటుంది. కాంగ్రెస్ వల్లనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం అయింది. సెప్టెంబర్ 17 1948 వరకు మన సంస్థానంకి స్వతంత్రం రాలేదు. దూరదృష్టితో అప్పటి ప్రధాని నెహ్రూ సర్దార్ వల్లభాయ్ పటేల్‌ని పంపి దే శంలో విలీనం చేయించారు. చరిత్ర తెలుసు కోకుండా అందరూ మాట్లాతున్నారు. స్వతంత్ర ఉద్యమంలో బీజేపీ పాత్రనే లేదు. అనాడు ఉన్న ఇప్పటి బీజేపీ అనుబంధ సంఘాలు బ్రిటిష్ పాలకులకు వత్తాసు పలికారు. పదేళ్లు తెలంగాణను కేసీఆర్ తుంగలో తొక్కారు. రాజీవ్ గాంధీ విగ్రహం పెడితే ఇష్టం వచ్చిన ట్టు మాట్లాడుతున్నారు. ఐటీ రంగాన్ని దేశా నికి పరిచయం చేసింది రాజీవ్ గాంధీ. కేటీ ఆర్ సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారు. కేటీఆర్‌కు పదేళ్లు తెలంగాణ తల్లి గుర్తుకు రాలేదా తెలంగాణ తల్లిని గౌరవించాలని.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రభుత్వం సెక్రటేరియట్ గుండెల్లో పెడుతుంది. ప్రజలు ఆలోచన చేయాలని పీసీసీ ఛీఫ్ అన్నారు.

# త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు

- భూమి లేని నిరుపేదల ఖాతాల్లో రూ.12 వేలు వేస్తాం
- సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**ఖమ్మం,సెప్టెంబర్ 17 :** ఈ ఏడాది నుంచి భూమిలేని నిరుపేదల బ్యాంకు ఖాతాల్లో ఏడాది 12 వేలు వేస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో మంజూరు పత్రాలను డిప్యూటీ సీఎం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. నిరంకుశ రాచరిక పరిపాలన నుంచి తెలంగాణ రాష్ట్రం ప్రజాస్వామ్య పరిపాలనలోకి వచ్చినందున ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం చేసిన ఈ ప్రకటనను వ్యతిరేకించిన వారు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించినట్టే. అవుతుందన్నారు. సెప్టెంబర్ 17 దినోత్సవం విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్న పార్టీల నాయకులు ప్రజా ప్రభుత్వం ప్రకటించిన ప్రజాపాలన దినోత్సవాన్ని స్వాగతించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టబోతున్నామని చెప్పారు. ఇప్పటికే భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ లబ్దిదారులకు ఆరు లక్షల రూపాయలు ఇతర లబ్దిదారులకు ఐదు లక్షల రూపాయలను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ అందిస్తుందన్నారు. రైతులకు రుణమాఫీ, పంటల బీమా, రైతు బీమా, సబ్సిడీ విద్యుత్తు అందించడంతో పాటు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సోలార్ వ్యవసాయ పంపు సెట్లు తీసుకొస్తున్నామని వివరించారు. మధిర నియోజకవర్గం సిరిపురం గ్రామాన్ని సోలార్ వ్యవసాయ పంపు సెట్ల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. సోలార్ విద్యుత్తు వ్యవసాయం పంపు సెట్ల వినియోగానికి పోగా మిగిలిన కరెంటును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దీని ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములు చేసే విధంగా ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందన్నారు. సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకోవడానికి స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే రుణాలు ఇప్పిస్తుందని చెప్పారు.

## ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే
# రాజీవ్ విగ్రహావిష్కరణ

- చేతనైతే ఇచ్చిన హామీలు అమలు చేయండి
- రైతుబంధు వెంటనే ఇచ్చి నిజాయితీ చూపండి
- తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ
- తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 :** ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే సచివాలయం ఎదుట దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని స్థాపించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్య లు చేశారు. మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుక లు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను మాజీ మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని ముద్దపప్పు అని తిట్టారని.. ఇప్పుడు వాటిని కవర్ చేసుకోవడానికి రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టాడని రేవం త్ రెడ్డి చెప్తున్నారని... కంప్యూటర్ కనిపెట్టిన ఛార్లెస్ బాబేజ్ ఆత్మ ఎక్కడున్నా బాధపడుతుం దంటూ ఎద్దేవా చేశారు. మీకు చేతనైతే హామీలు అమలు చేయండి.. 420 అడ్డగోలు హామీలు అమలు చేయండి. చేతనైతే రైతుబం దు ఇవ్వండి వానాకాలంకు 14 రోజులే మిగిలింది. చేతనైతే కరెంటు సరిగా ఇవ్వండి. చేతనైతే పింఛన్లు, మహిళలకు ఇచ్చిన హామీ లు నెరవేర్చండి. రేవంత్ రెడ్డి చేతనైతే మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చండి అంటూ హితవు పలికారు. పోలీస్ బండ్లల్లో డీజిల్ పోయడానికి నిధులు ఇవ్వడంలేదని విమర్శించారు. రామ గుండంలో రూ. 2కోట్లు డీజిల్ బిల్లులు పెండిం గ్ ఉన్నాయన్నారు. అక్కడ బంకు వాళ్లు పోలీస్ బండ్లకు డీజిల్ పోయడం లేదని తెలిపారు. ఇంకో 14 రోజుల్లో వర్షాకాలం ముగుస్తుం దని.. ఇప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే పెన్షన్ రూ. 4000 అన్నారు అది లేదని.. మహిళలకు రూ. 2500 అన్నారని.. చేతనైతే అది ఇవ్వండి అంటూ వ్యాఖ్యలు చేశారు. సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు అని రాహుల్ గాంధీ, రేవం త్ రెడ్డి అన్నారని... 9 నెలలు అయిపోయిం దని ఉద్యోగాల ప్రస్తావన లేదని... చేతనైతే ఇవ్వని చేసి చుపెట్టాలన్నారు. ఈ రాష్ట్రంలో ఇంతవరకు పాలన అనేది లేదని..కానీ రేవంత్ రెడ్డి ఇవాళ ప్రజపాలన దినోత్సవం జరుపుతు న్నారని మాజీ మంత్రి మండిపడ్డారు. గురుకు లాల్లో విద్యార్థులు విష ఆహారం తిని అవస్థలు పడుతున్నారని తెలిపారు. గురుకుల విద్యార్థిను లపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. గురుకుల టీచర్లను 2500 మందిని తీసీ పక్క న పెట్టారన్నారు. రాష్ట్రంలో పారిశుధ్యం పడకే సిందని.. ఎక్కడ చూసినా చికెన్ గున్యాలు, డెంగ్యూలు, విష జ్వరాలు ప్రబలుతున్నాయ న్నారు. ప్లలెల్లో ప్రజలు దోమల బారిన పడుతు న్న పిచికారి లేదన్నారు. హోంగార్డులకి జీతా లు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో హెల్త్ ఎమ్జంగ్సీ పెట్టే విధంగా పరిస్థితి ఉందన్నారు. ఏ ఇంట్లో చూసినా పిల్లలు జ్వరాల బారిన పడి బాధపడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని సమస్యలు ఉంటే ఇవన్నీ పట్టించుకోకుండా కేవలం కేసీఆర్‌ను బీఆర్ఎస్ నాయకులను తిట్టడమే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మరోవైపు సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలునిచ్చిన విషయం తెలిసిందే. ముందుగా తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు కేటీఆర్. తెలంగాణ భవన్ లో నిర్వహించిన జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకల్లో మాజీ మంత్రులు మల్లారెడ్డి, శ్రీని వాస్ గౌడ్, గంగుల కమలాకర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు హాజరయ్యారు.

# తెలంగాణ స్వేచ్ఛకు యావత్ సమాజం కొట్లాడింది

- సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నాం
- ప్రజాపాలన దినోత్సవంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం, సెప్టెంబర్ 17 :** చరిత్రలో 1948వ సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీకి ఒక విశిష్టత ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 76 సంవత్సరాల క్రితం ఇదే రోజున మన తెలంగాణ, నాటి హైదరాబాద్ సంస్థానం రాజుల పాలన నుంచి భారతదేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య ప్రజాపాలన దశలోకి పరివర్తన చెందిందని తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం నాడు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో డిప్యూటీ సీఎం మాట్లాడు తూ.. తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం ఆనాటి యావత్ సమాజం ఉద్యమించిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలు చేయడం ప్రారంభించిందన్నారు. చివరి వరుసలోని పేదలకు కూడా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులను స్వీకరించి అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందించడం జరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబా నికి గ్యారెంటీ పథకాలను అందించే దిశగా జిల్లాలోని ఎంపీడీఓ కార్యాలయాలు, సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని డిప్యూటీ సీఎం చెప్పారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే అమలు చేసి చరిత్ర సృష్టించిందన్నారు. ఆడ బిడ్డలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని.. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకూ రాష్ట్రంలో 87.12 కోట్ల ఉచిత ప్రయాణాలు మహిళలు చేశారన్నారు. ఉచిత ఆర్టీసీ పథకం ద్వారా మహిళలకు 2958 కోట్ల రూపాయలు ఆదా చేయగలిగామ న్నారు. ఈ పథకం ద్వారా ఖమ్మం జిల్లాలో మహిళలకు దాదాపు 1,79,97,210 పైగా జీరో టికెట్లను జారీ చేశామని.. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు దాదాపు 8432.83 లక్షల రూపాయలను ఆదా చేశారని చెప్పారు. రూ. 500 కే వంటగ్యాస్ సిలెండర్ పంపిణీ ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలన్న లక్ష్యంతో ప్రారంభించిందే మహాలక్ష్మి పథకంలోని మరో పథకం 500 రూపాయలకే వంట గ్యాస్ ఇవ్వాలన్న ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 27న ప్రారంభించామన్నారు.



# దేశవిభజన కాంగ్రెస్ పాపమే

**ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్య**

**లక్నో,సెప్టెంబర్ 16 :** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కాంగ్రెస్ పై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. దేశ విభజనకు హస్తం పార్టీ కారణమని తీవ్ర ఆరోపణలు చేశారు. అదే పాకిస్థాన్ ఏర్పాటుకు దారి తీసిందని ఆరోపించారు. త్రిపురలో సిద్ధేశ్వరి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం యోగి.. ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశ విభజనకు కాంగ్రెస్ కారణం. దేశాన్ని రెండుగా విభజించేలా ముస్లిం లీగ్‌కు మద్దతు హస్తం పార్టీ మద్దతు ఇచ్చింది 1905లో బెంగాల్‌ను విభజించేందుకు బ్రిటిషర్లు ప్రయత్నం చేయగా ప్రజల తిరుగుబాటుతో అది విఫలమైంది.. అదే విధంగా ముస్లిం లీగ్ ప్రయత్నాలను వ్యతిరేకించి ఉంటే పాకిస్థాన్ ఏర్పాటు అయ్యేది కాదు' అని యోగి పేర్కొన్నారు. సీఎం యోగి పాకిస్థాన్‌ను క్యాన్సర్‌తో పోలుస్తూ వినాశకర శక్తిగా పేర్కొన్నారు. పొరుగు దేశం బంగ్లాదేశ్‌లోని పరిస్థితిపై యోగి ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితిపై చర్చించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దీనికి బాధ్యులెవరో.. వారు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు.





# డప్పు కళాకారులకు పెరుగుతున్న ఆదరణ

- పండగ ఏదైనా తీన్మార్ ఉండాల్సిందే
- గణేశ్ ఉత్సవాల్లో వారి డప్పుకే పెద్దపీట
- ఉపాధి కోసం పట్నాలకు వస్తున్న దరువుకారులు

**హైదరాబాద్, సెప్టెంబర్17 :** వారు దరువేసి డప్పుపై తీన్మార్ వాయిస్తే.. ఒళ్లు పూనకం వచ్చినట్టు ఊగిపోవాల్సిందే... వారి డప్పు మోగిస్తే... ఎదురుగా ఉన్న ప్రతి మనిషి నాట్యం చేయాల్సిందే.... గ్రామీణ డప్పు కళాకారుల ప్రతిభ ఇప్పుడు పట్టణాలకు వ్యాప్తి చెందింది. దీంతోపాటు ఎక్కడికి వెళ్లినా వారు తమకు ఉపాధి దక్కడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ డప్పు కళాకారులకు వివిధ సందర్భాల్లో పట్టణాలకు వచ్చి తమ సత్తా చాటుతున్నారు. దీంతో వారి ఉపాధికి ఢోకా లేకుండా పోయింది. కార్యక్రమం లేదా పండగ లేదా జాతరేదైనా ఇప్పుడు వారు ముందుంటున్నారు. బోనాల జాతర,వినాయక నిమజ్జనం, దసరా ఉత్సవాలు ఇలా వివిధ రకాల పండుగలకు సంబంధించి గ్రామీణ డప్పు కళాకారులు బాగా ప్రాచుర్యం పొందారు. ఇటీవల వీరంతా గణనాథుల నిమజ్జనంలో భాగంగా జంటనగరాలతో పాటు పట్టణాల్లో సత్తా చాటారు. ఇలా డప్పు కళాకారులు గ్రామాల నుంచి బతుకు దెరువును వెతుక్కుంటూ పట్టణాలు, నగరాలకు తరలి వచ్చారు. నగరంలోని బ్యాండ్ వాయించే కళాకారులు ఎక్కువ మొత్తంలో పైకాన్ని వసూలు చేయడంతో ఉత్సవ నిర్వాహకుల దృష్టి గ్రామీణ కళాకారులపై పడింది. గ్రామీణ కళాకారులైతే తక్కువకు వస్తారని నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు గ్రామీణ కళాకారుల వద్దకు వస్తున్నారు. ఇలా గత కొంతకాలంగా నిమజ్జన ఉత్సవాలకు హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలైన మెదక్, వరంగల్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి తీన్మార్ వాయించే డప్పుల కళాకారులు వస్తున్నారు. అదే కోవలో ఈ సంవత్సరం కూడా వివిధ జిల్లాల నుంచి బృందాలుగా ఏర్పడి వందలాది మంది వచ్చి సికింద్రాబాద్‌లోని జింఖానా పరేడ్ మైదానం గోడ పక్కన సేద తీరుతూ ఉపాధిని వెతుక్కుంటున్నారు. డప్పులు దరువేసి నాలుగు రూపాయలు సంపాదించవచ్చనే ఆశతో పని కోసం ఎదురు చూస్తున్నారు. అయితే వందల కిలోమీటర్ల దూరం నుంచి వందలాది రూపాయల చార్జీలు పెట్టుకొని కళాకారులు కడుపు చేతబట్టుకొని ఎంతో ఆశతో నగరానికి వచ్చారు. ఈ తరుణంలో గ్రామీణ కళాకారులేగా అని చిన్న చూపు చూస్తూ వారి వద్దకు వచ్చి ఇష్టారాజ్యంగా కళాకారులకు ఒక్కరికి రూ.200 నుంచి రూ.500ల వరకు బేరమాడుతున్నారు. ఒక వేళ బేరం కుదిరినా.. పని పూర్తయ్యాక ఇస్తామన్న పైకం ఇవ్వకుండా ఉడాయిస్తున్నారు. కొందరు మాత్రమే ఆదరిస్తున్నారు.

# బాలాపూర్ లడ్డూ మరో రికార్డు

## అత్యధికంగా 30లక్షల ఒకవేయికి వేలం

- పోటీపడి దక్కించుకున్న బిజెపి నేత కొలను శంకర్ రెడ్డి
- లడ్డూను ప్రధాని మోడీకి అంకితమిస్తున్నట్లు ప్రకటన



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 :** బాలాపూర్ గణపతి లడ్డూ మరోసారి రికార్డు ధర పలికింది. ప్రతి సంవత్సరం కొత్త రికార్డులు సృష్టించుకొని బాలాపూర్ గణేశ్ లడ్డూ పైపైకి వెళ్తోంది. ఈసారి కూడా అందరి అంచనాలకు తగ్గట్టుగానే పోటాపోటీగా వేలం సాగింది. కొత్తగా తీసుకొచ్చిన రూల్ ప్రకారం ముందుగా గతేడాది లడ్డూ అమ్ముడుపోయిన ధర డబ్బులు డిపాజిట్ చేస్తేనే ఈసారి వేలంలో పాల్గొనే అవకాశం ఇచ్చారు. అందుకే చాలా తక్కువ మంది ఈ డబ్బులు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. గతేడాది 27 లక్షలకు లడ్డూ వేలంలో అమ్మడుపోయింది. దీంతో ఆ 27 లక్షలు డిపాజిట్ చేసిన కొద్ది మంది మాత్రమే ఈ వేలంలో పాల్గొన్నారు. గతేడాది ఆక్షన్‌లో పాల్గొన్న దయానందరెడ్డి కూడా ఈసారి 27 లక్షలు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. పోటీలో ఉన్నది తక్కువ మంది అయినప్పటికీ పోటీ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. పోటీలో ఉన్న కొద్దిమంది లడ్డూ కోసం హోరాహోరీగా తలపడ్డారు. చివరకు 30 లక్షల ఒక వెయ్యి రూపాయలకు కొలను శంకర్‌రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. గతేడాది ఈ లడ్డూను 27 లక్షల రూపాయలకు ఈయన దక్కించుకున్నారు. ఇసారి కూడా 27 లక్షలు డిపాజిట్ చేసి వేలంలో పోటీ పడి మరీ భారీ ధర చెల్లించి లడ్డూను ఇంటికి తీసుకెళ్లారు. గతేడాది లడ్డూ దక్కించుకున్న తర్వాత బాగా కలిసి వచ్చిందని అందుకే ఈసారి పోటీ పడి మరీ సొంత చేసుకున్నట్టు చెప్పుకొచ్చారు. బాలాపూర్ గణెళిశ్ లడ్డూ వేలంపాటలో ఈసారి రికార్డు స్థాయి ధర పలికింది. 30లక్షల 1000 రూపాయలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గత ఏడాది లడ్డూ రూ.27 లక్షలు పలికింది. స్థానికేతరుడైన దాసరి దయానంద్‌రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. వేలంపాట అనంతరం ఉదయం 11 గంటలకు బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర ప్రారంభం అయ్యింది. లడ్డూను దక్కించుకున్న అనంతరం కొలను శంకర్‌రెడ్డి మాట్లాడారు. బాలాపూర్ లడ్డూ మా కుటుంబానికి దక్కడం ఇది తొమ్మిదో సారి. ఈ లడ్డూను ప్రధాని మోదీకి అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు. 1994 నుంచి బాలాపూర్‌లో లడ్డూ వేలం పాట కొనసాగుతోంది. మొదట రూ.450తో ప్రారంభం కాగా.. 2016లో రూ.14.65 లక్షలు, 2017లో రూ.15.60 లక్షలు, 2018లో రూ.16.60లక్షలు, 2019లో 17.60 లక్షలు, 2021లో రూ.18.90 లక్షలు, 2022లో రూ.24.60 లక్షలు పలికింది. 2020లో కరోనా కారణంగా వేలం పాట రద్దు చేశారు. బాలాపూర్ ముఖ్య కూడలిలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

# కన్నుల పండువగా గణేశ్ నిమజ్జనం

- గంగమ్మ ఒడిలో సేదతీరిన మహాగణపతి
- భక్తుల కోలాహలంతో సందడిగా సాగరతీరం
- భారీగా తరలివచ్చి నిమజ్జనాన్ని వీక్షించిన జనం
- పోలీసుల ప్రత్యేక చర్యలతో సమయానికే నిమజ్జనోత్సవం



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 :** కోలాటాలు..భజనలు.. తీన్మార్ స్టెప్పులు.. భాజాభజంత్రీలు.. గణపతి బొప్పా మోరియా అంటూ భక్తుల నినాదాల మధ్య గణేశ్ నిమజ్జనం సందడిగా సాగింది. హుస్సేన్ సాగర్ పరిసరాలు పులకించాయి. ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ క్రమంలో అనుకున్న సమయానికే ఖైరతాబాద్ మహా గణేశుడి విగ్రహ నిమజ్జనం అంగరంగా వైభవంగా జరిగింది. జయజయధ్వానాల మధ్య అంతిమ పూజలు అందుకున్న ఖైరతాబాద్ మహా గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం మంగళవారం ఒంటిగంటన్నరకు పూర్తయ్యింది. ట్యాంకు బండ్‌పై నాలుగో నెంబర్ క్రేన్ ద్వారా బడా గణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఖైరతాబాద్ మహా గణపతి కోసం హైదరాబాద్ నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలు గణపతి బప్పా మోరియా నినాదాల తో హోరెత్తాయి. మహాగణపతి నిమజ్జనాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. ఖైరతాబాద్ గణపతి నిమజ్జనం వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు. బడా గణపతికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేశారు. మంగళవారం ఉదయం నుంచి ఖైరతాబాద్ గణేషుడి శోభాయాత్ర అట్టహాసంగా, కన్నుల పండుగలా జరిగింది. గత సంవత్సరం నుంచి ఖైరతాబాద్ నిమజ్జన కార్యక్రమం ముందుగానే జరుపుతున్నారు. ఖైరతాబాద్ బాద్ నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమైన సప్తముఖ మహా గణపతి శోభాయాత్ర ప్రారంభమైంది. టెలిఫోన్ భవన్, సెక్రటేరియట్, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ట్యాంక్‌బండ్ చేరుకున్నాడు. అనంతరం వెల్డింగ్ పనులు పూర్తయిన తర్వాత.. మహాగణపతికి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. నాలుగో నంబర్ క్రేన్ వద్ద లంబోధరుడిని నిమజ్జనం చేశారు. మహాగణపతి నిమజ్జనాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో ట్యాంక్‌బండ్ జన సంద్రంగా మారిపోయింది. భాగ్యనగరమే కాదు దేశవ్యాప్తంగా ఖైరతాబాద్ గణేషుడికి ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నది. ఉత్సవాలను ప్రారంభించి 70 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి రికార్డు స్థాయిలో 70 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శిల్పి చిన్నస్వామి రాజేందర్ ఆధ్వర్యంలో లంబోధరుడుని రూపొందించారు. 200 మంది కార్మికులు ఒకటిన్నర రోజులు శ్రమించి గణేషుడిని అలంకరించారు. 11రోజులపాటు మహాగణపతిని లక్షలాది మంది భక్తులు, సందర్శకులు దర్శించుకున్నారు. ఈసారి రూ.కోటి 10 లక్షల ఆదాయం సమకూరిందని నిర్వాహకులు వెల్లడించారు. హుండీ ద్వారా రూ.70 లక్షలు రాగా, ప్రకటనలు, హోర్డింగుల ద్వారా మరో రూ.40 లక్షలు సమకూరాయి. గణేశ్ నిమజ్జనంలో పాల్గొన్న తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచారు. పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగిన ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. అటు నుంచి నేరుగా ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకున్నారు. మహాగణపతి నిమజ్జనం జరిగే క్రేన్ నంబర్ 4 వద్ద పరిశీలన జరిపారు. అక్కడి నుంచే హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జన కార్యక్రమాలను వీక్షించారు. ఇక ఉదయం నుంచే పలు ప్రాంతాల నుండి గణేశ్ విగ్రహాలు ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నాయి. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య గౌరీపుత్రుని తనయుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. సూపర్ క్రేన్ ద్వారా 70 అడుగుల మహాశక్తి గణపతిని నిమజ్జనం చేశారు. అంతకుముందు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా భాగ్యనగరం సందడిగా మారింది. ట్యాంక్ బండ్ పరిసరాలు జన సంద్రంగా మారాయి. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలి రావడంతో ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్, సచివాలయం, ఐమాక్స్ మార్గాలు కిక్కిరిసిపోయాయి. వేలాది విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరుతున్నాయి. బుధవారం సాయంత్రానికి అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దాదాపు 25 వేల మంది పోలీసులు బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. సీసీ కెమెరాలతో నిఘా తీవ్రం చేశారు. ఆకతాయిల చర్యలు అరికట్టేలా షీ టీమ్స్ బృందాలు సైతం రంగం లోకి దిగాయి. గణేశ్ నిమజ్జనం సందర్భంగా మంగళ, బుధవారాల్లో నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ ఆంక్షలు అమలు అవుతున్నాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున గణేశ్ విగ్రహాలు హుస్సేన్ సాగర్ వైపు రానుండడంతో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నామని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మరోవైపు, గణేశ్ నిమజ్జనం ఉత్సవాల సందర్భంగా అర్ధరాత్రి వరకూ ఎంఎంటీఎస్ రైళ్ల అదనపు సర్వీసులను ద.మ రైల్వే నడపనుండగా.. ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులు నడపనుంది. అర్ధరాత్రి 2 గంటల వరకూ మెట్రో సర్వీసులు నడుస్తాయని అధికారులు వెల్లడించారు.



# మయన్మార్ అతలాకుతలం

## దాదాపు 226 మంది మృతి.. మరో 77 మంది గల్లంతు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :** భారీ వర్షాలతో మయన్మార్ అతలాకుతలమైంది. ఈ క్రమంలోనే యాగీ తుపాను విరుచుకుపడటంతో వరదలు పోటెత్తాయి. పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 226మంది మృతి చెందారు. మరో 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. దాదాపు 6.30 లక్షల మంది ప్రకృతి విపత్తుతో ప్రభావితమయ్యారని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఐరా స తెలిపింది. మయన్మార్‌లో ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత దారుణమైన వరదలు ఇవేనని పేర్కొంది. ఇప్పటికే అంతర్యుద్ధంతో సతమతమవుతున్న మయ న్మార్‌లో వరదల ధాటికి.. వేల ఎకరాల్లో పంట నాశన మైంది. రాజధాని నేపిడావ్ ప్రాంతం తీవ్రంగా ప్రభావితమైంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఆహారం, తాగునీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నట్లు ఐరాస తెలిపింది. రహదారుల వంటి మౌలిక సౌకర్యా లు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంది. ఈ క్రమంలోనే తమ దేశాన్ని ఆదుకోవాలని అక్కడి సైనిక పాలక వర్గం జుంటా విదేశీ సాయాన్ని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్‌లలోనూ యాగీ తుపాను విధ్వంసం సృష్టించింది. ఒక్క వియత్నాం లోనే 300 మందిని బలితీసుకుంది.

# సకాలంలో నిమజ్జనం జరిగేలా చర్యలు

- పక్కా ప్రణాళికతో పోలీసుల ఏర్పాట్లు
- త్వరగా పూర్తయిన నిమజ్జనాలు
- సీపీ సీవీ ఆనంద్ వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 :** భాగ్యనగరంలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుగుతోందని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్‌లో ఉన్న విగ్రహాలు త్వరగా నిమజ్జనం అయ్యేలా చూస్తున్నామన్నారు. గత ఏడాది లాగా ఆలస్యం కాకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మండప నిర్వాహకులతో మాట్లాడి నిమజ్జనం జరిగేలా చూస్తున్నామన్నారు. బాలాపూర్ వినాయకుడు కూడా త్వరగా నిమజ్జనం అయ్యేలా చూస్తున్నామని చెప్పారు. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. షిఫ్ట్ వారిగా 25 వేల మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిమజ్జనంలో పోలీసులు అలసిపోకుండా షిఫ్ట్‌లు ప్రకారం డ్యూటీ చేస్తున్నారన్నారు. లక్ష విగ్రహాలు సిటీలో ఉండొచ్చని.. 20 నుంచి 30 వేలు విగ్రహాలు పెండింగ్ ఉన్నాయన్నారు. రేపు ఉదయంలోగా నిమజ్జనం మొత్తం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ఏడాది లాగా కాకుండా ఈ ఏడాది త్వరగానే నిమజ్జనం అయ్యేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జనం కోసం వచ్చే ప్రజలు పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్‌లలో రావాలని కోరుతున్నామన్నారు. మీడియాలో వచ్చే లైవ్ టెలికాస్ట్ చూడాలని ప్రజలను కోరుకుంటున్నామని సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ ఏడాది వినాయక నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. వివిధ మత పెద్దలతో రెండు సార్లు కో ఆర్డినేషన్ మీటింగ్ లెవల్ జరిగిందన్నారు. సీపీ, డీసీపీ లెవల్‌లో కూడా సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. గణెళిష్ నిమజ్జనం ప్ర శాంత వాతావరణంలో కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నా రు. బాలాపూర్ గణెళిశుడు ఇప్పటికే హైదరాబాద్ లిమిట్స్‌లో ఊరేగింపు కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బైంసాతో పాటు మరికొన్ని ప్రదేశాల్లో నిమజ్జనం పూర్తి అయిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా అన్ని చర్యలు, ఏర్పాట్లు చేశామన్నారు. ఈరోజు రాత్రిలో గా నిమజ్జనం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్న ఇన్సిడెంట్ కూడా జరగకుండా టైం టు టైం అప్రమత్తంగా ఉంటూ ముందుకు వెళ్తామన్నారు. డీజీపీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, పర్యవేక్షణ కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కూడా పర్యవేక్షణ కొనసాగుతుందని అన్నారు. మూడు కమిషనరేట్ పరిధిలో లక్ష విగ్రహాలు నిమజ్జనం జరుగుతున్నాయన్నారు. బుధవారం వర్కింగ్ డే కాబట్టి ఈరోజు రాత్రిలోపే నిమజ్జనం అయ్యేలా చర్యలు తీసుకుంటామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. షిఫ్ట్ వారీగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. నిమజ్జనంలో పోలీసులు అలసిపోకుండా షిఫ్ట్‌ల వారీగా డ్యూటీ చేస్తున్నారు. నగరంలో దాదాపు లక్ష విగ్రహాలు ఉండొచ్చు. వాటిలో 20వేల నుంచి 30వేల విగ్రహాలు పెండింగ్ ఉన్నాయి. రేపు ఉదయం లోగా నిమజ్జనం మొత్తం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**ప్రజానావ, ఇచ్చోడ :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఇచ్చోడ మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సహకార చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ది ఆదిలాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఇచ్చోడా బ్రాంచ్ (ఏడిసిసి) లో తెలంగాణా ప్రజాపాలనా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలో అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ రనవీర్, సూపర్వైజర్ అలీ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు

**ప్రజానావ, నేరడిగొండ :** బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ క్యాంప్ కార్యాలయంలో జాతీయ సమైక్యత దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆయన ఎగురవేశారు. అంతకుముందు తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ సువిశాలమైన భారతదేశంలో అంతర్భాగంగా మారిందన్నారు. రాచరిక పాలన నుండి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన పొందిందనందుకే గత బిఆర్ఎస్ ప్రభుత్వం జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించిందని, అదేవిధంగా దేశంలో ఏ రాష్ట్రం జరపలేనంత ఘనంగా 15 రోజుల పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలను జరిపిందని గుర్తుకు చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'ప్రాంతీయ పార్టీ'.. కబ్జాలే పని!

**ఆదిలాబాద్ పట్టణాధ్యక్షుడి ఆక్రమణల పర్వం**

**వెంచర్లు వేసి అమ్ముకుంటున్న వైనం**

**నాలా బఫర్ జోన్లలోనూ నిర్మాణాలు**

**డాల్డా కంపెనీ, ఖుర్షీద్‌నగర్, ఉస్మానియానగర్‌లో భూ అక్రమాలు**





ఆయన ఒక కౌన్సిలర్.. ఒక పార్టీకి పట్టణాధ్యక్షుడు.. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ పాట పాడే ఆ ప్రాంతీయ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షుడు గతంలో ఓ కేసులో జైలు పాలు కావడంతో... రెండేళ్ల క్రితం పార్టీ ఇంకొకరికి పట్టణాధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. అప్పటి ఆ కౌన్సిలర్ అరాచకత్వం పెరిగింది. కనిపించిన ప్రభుత్వ భూమినల్లా కబ్జా చేస్తూ కోటీశ్వరుడిగా మారాడు. పార్టీలో ఏకఛత్రాధిపత్యం నడిపిస్తూనే.. ఇతర పార్టీల నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాడు. ప్రభుత్వ భూముల్లోనూ వెంచర్లు వేస్తూ అమ్మడం ప్రారంభించాడు. బఫర్ జోన్‌లోనూ నిర్మాణాలు చేపడుతూ మున్సిపాలిటీ అధికారులు అంతా తన చేతుల్లో ఉన్నారని ప్రచారం చేయడం మొదలుపెట్టాడు. బినామీల పేర్లతో డాల్డా కంపెనీ, ఖుర్షీద్ నగర్, ఉస్మానియా నగర్, సూపర్ స్పెషాలిటీ ఎదుట నిర్మితమైన, నిర్మాణంలో ఉన్న భవనాలను దీన్ని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అంతా తెలిసినా.. మున్సిపాలిటీ అధికారులు మౌనంగా ఉండడం వెనక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

**ప్రజానావ, కాగజ్ నగర్ టౌన్ :** పట్టణంలోని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు నివాసంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచ యవనిక మీద గురుస్థానంలో నిలబెట్టే బాధ్యతను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భుజానికి ఎత్తుకున్నారని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు జీవించాలని భగవంతున్ని వేడుకున్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే సేవా పక్వాడా (సప్తాహం) కార్యక్రమంలో భాగంగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, జిల్లా కార్యదర్శి అరుణ్ లోయ, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, దెబ్బటి శ్రీనివాస్, మాజీ ఎంపిపి మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు శ్రీదేవి, రాణి, ముంజం మోహిని, అర్జున్, అశోక్, శ్రీనివాస్, దీపక్, కొండ తిరుపతి, గోవింద్ మండల్, అశుతోష్, సంతోష్, కిషోర్, పోచం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం విమోచన దినోత్సవం జరపకపోవడం సిగ్గుచేటు

**సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**



**ప్రజానావ, కాగజ్ నగర్ టౌన్ :** సెప్టెంబర్ 17 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవం జరుపకపోవడం సిగ్గుచేటని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగాఎమ్మెల్యే నివాసంలో, రాజీవ్ చౌక్ లో జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం జరపాల్సిందని, ప్రజా పాలన దినోత్సవం పేరిట చరిత్రను వక్రీకరించడం అన్యాయమని తెలిపారు. అందుకే తాము ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించే ప్రజా పాలన దినోత్సవ వేడుకకు దూరంగా ఉన్నామని అన్నారు. బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి అనే జానపద గేయం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి తెలంగాణ విముక్తి కోసం స్వాతంత్ర్య సమరయోధులు పోరాటాలు చేశారని, వారి ఆశయ సాధన కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమైందని తెలిపారు. ఇది ముమ్మాటికీ విమోచన దినోత్సవమేనని, విలీనమని, సమగ్రత దినమని, సమైక్యత దినమని, ప్రజా పాలన దినోత్సవమని చరిత్రను తిరగరాసే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, జిల్లా కార్యదర్శి అరుణ్ లోయ, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, దెబ్బటి శ్రీనివాస్, మాజీ ఎంపిపి మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు శ్రీదేవి, రాణి, ముంజం మోహిని, అర్జున్, అశోక్, శ్రీనివాస్, దీపక్, కొండ తిరుపతి, గోవింద్ మండల్, అశుతోష్, సంతోష్, కిషోర్, పోచం తదితరులు పాల్గొన్నారు.




# విమోచనం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

**ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యే**

**ప్రజానావ, ఆదిలాబాద్ :** హైదరాబాద్ విమోచనం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుం దామని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం లోని (ఆర్ట్స్, కామర్స్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్లో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ లిబరేషన్ డే ఫోటో ఎగ్జిబిషన్ ను ఎంపీ, ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతుంది అన్నారు. ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం చాలా ప్రశంసనీయమన్నారు. హైదరాబాద్ లిబరేషన్ లో పోరాడిన నాయకులు ఎవరు, తదితర అంశాలను ఫొటో ఎగ్జిబిషన్‌లో కలవన్నారు. ఈ చారిత్రాత్మక సంఘటనలన్నింటినీ మనం తెలుసుకోవాలి, వాటిని తరువాతి తరాలకు ముందుకు తీసుకెళ్లేలా చూడాలి అన్నారు. అదేవిధంగా హైదరాబాద్ లిబరేషన్ డే వేడుకలలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి. ధర్మ నాయక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ డా. అతీక్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, 32(టీ ) బెటాలియన్ ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ వికాస్, ఆకాశవాణి ప్రోగ్రాం హెడ్ రామేశ్వర్ రావు, హెడ్ పోస్ట్ మాస్టర్ కె. ఉత్తమ్ కుమార్, సీబీసీ ఏపీఏ రషీద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని దర్శించుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ప్రజానావ, ఇచ్చోడ :** ఇచ్చోడా మండల కేంద్రంలోని గణేష్ నిమజ్జనం సందర్భంగా ఓల్డ్ ఏస్సి కాలనీ అంబెడ్కర్ యువజన సంఘం నెంబర్ వన్ గణేష్ మండపం వద్ద మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న గణేష్ మండపాల వద్ద పూజలు చేసి నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండపల నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తికి శిక్ష, జరిమానా

**ప్రజానావ, ఆసిఫాబాద్ :** పోక్సో కేసులో మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి 5 సంవత్సరాల జైలు, 12 వేల జరిమానా విధిస్తూ అసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు ఇచ్చారు. చింతలమానపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన దుర్వ భాస్కర్ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ అశ్లీలలను చూపించడంతో బాలిక భయపడి తల్లిదండ్రులకు తెలియజేయడంతో 03.11.2020న బాలిక తల్లి ఫిర్యాదు మేరకు దుర్వ భాస్కర్ పైన ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా , పి పి జి వి ఎస్ ప్రసాద్ సాక్షులను హాజరు పరచగా , విచారణ చేసిన జడ్జి నేరం చేసినట్టు రుజువు కావడంతో నిందితుడుకి పై తీర్పునిచ్చారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత కాగజ్నగర్ డిఎస్పి రామానుజం, కౌటాల సిఐ ఎం రమేష్, ఎస్సై నరేష్, కోర్టు కాగజ్ నగర్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ బాబాజీ కోర్ట్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు.

## బల్దియా ఆస్తుల ఆక్రమణలపై కలెక్టర్ కు వినతి

**ప్రజానావ, కాగజ్ నగర్ టౌన్ :** కాగజ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో బల్దియా ఆస్తులు ఆక్రమణకు గురవుతున్నాయని, అక్రమార్కులు అధికారుల సహకారంతో కోట్ల రూపాయల విలువైన బల్దియా భూములను కబ్జా చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారని వాటిని గుర్తించి సత్వరమే తొలగించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత షబ్బీర్ హుస్సేన్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డులో ధోబి ఘాట్ ఆక్రమణ గురైందని, విశాలంగా ఉన్న ధోబి ఘాట్ ను కొందరు బోగస్ పత్రాలు సృష్టించి మున్సిపల్ అధికారుల అండ దండలతో ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. కోట్ల రూపాయల విలువైన ఈ ధోబి ఘాట్ లో పెద్ద షెడ్ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఏళ్ల నుండి ధోబీ ఘాట్ను ప్రజలు చూస్తున్నారని కానీ ఈ మధ్య కాలంలో బల్దియాకు సంబంధించిన ఏ భూమి అయినా కబ్జాకోరుల కబంధ హస్తాల్లో వెళ్ళిపోతుందని ఆరోపించారు. కొందరు మున్సిపల్ ప్రజా ప్రతినిధుల



ప్రోత్సాహంతో పట్టణ వ్యాప్తంగా కబ్జా పర్వం కొనసాగుతోందని ఆరోపించారు. పట్టణానికి చెందిన ఒక బడా స్టీల్ వ్యాపారి నకిలీ పత్రాలు సృష్టించి ధోబి ఘాట్ ను కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని, ఆ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా సర్ సిల్క్ డంప్ యార్డు సైతం అక్రమ కబ్జాకు గురైందని డంప్ యాడ్ స్థలం పై విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.



# సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట

## అభివృద్ధి పథంలో తెలంగాణ ముందంజ

- తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్
- కలెక్టరేట్‌లో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**ప్రజానావ, ఆసిఫాబాద్ ప్రతినిధి:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం స్ఫూర్తితో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలను మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి త్రివర్ణ పథకాన్ని ఆవిష్కరించారు.

### జల్ జంగల్ జమీన్ స్ఫూర్తితో

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని అడవుల్లో తుడుం మోత మోగించి అడవిబిడ్డలను ఒక్కటి చేసి, "జల్-జంగల్-జమీన్" కోసం గర్జించిన ఆదివాసి యోధుడు కొమురంభీమ్ పోరాటాన్ని సగర్వంగా చాటుదాం అన్నారు.

### అన్ని వర్గాలకు పెద్దపీట

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 హామీలలో భాగంగా జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తులను పరిష్కరించి అర్హులైన లబ్దిదారులకు పథకాల ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. పరిపాలనను గ్రామాలకు చేర్చాలనే ప్రభుత్వ ఆలోచన మేరకు గత సంవత్సరం డిసెంబర్ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాలో 1 లక్షా 45 వేల 549 దరఖాస్తులు వచ్చాయి యాన్నారు. మహాలక్ష్మి పథకంలో హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలలో 2 గ్యారెంటీలను ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే అమలు ప్రారంభించి చరిత్ర సృష్టించిందన్నారు. ఆడబిడ్డలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ... ఆడపడుచులు, ట్రాన్స్ జెండర్లకు ఆర్.టి.సి. బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. మహిళలు పైసా ఖర్చు లేకుండా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం ఈ పథకం ద్వారా లభిస్తోందన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 54 లక్షల 62 వేల 705 మంది మహిళలు ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారన్నారు . దీని ద్వారా మహిళలకు 18 కోట్ల 27 లక్షల 90 వేల రూపాయలు లబ్ది చేకూరిందనీ, రాష్ట్రంలో నిరుపేద సైతం కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లి ఖరీదైన వైద్యాన్నిపొందాలన్న లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందించే వైద్య చికిత్సల పరిమితిని 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచింది. కొత్తగా 163 చికిత్సలను ఈ పథకంలో చేర్చిందన్నారు. మొత్తం 1 వేయి 835 చికిత్సలకు 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందుతోందన్నారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలనే లక్ష్యంతో 75 వేల 289 మందికి లబ్ది చేకూరుతోంది. ఇందుకు గాను ప్రభుత్వం 45 కోట్ల 30 లక్షలు సబ్సిడీ అందజేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో పేద, బడుగు వర్గాల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు "ఇందిరమ్మ ఇండ్లు" పేరుతో నూతన గృహనిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందనీ. ఈ లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తోంది. ఈ పథకం క్రింద ఈ ఒక్క సంవత్సరంలోనే 4 లక్షల 50 వేల గృహాలు నిర్మించ తలపెట్టడం జరిగిందని . ఈ పథకం క్రింద ప్రతి నియోజకవర్గంలో 3 వేల 500 గృహాలు నిర్మించడం జరుగుతుందన్నారు. అల్పాదాయ వర్గాల వారికి విద్యుత్ బిల్లుల భారం తగ్గించి వారి గృహాలలో చీకట్లను పారద్రోలి విద్యుత్ వెలుగులు నిపేందుకు గృహజ్యోతి అమలు చేస్తున్నాంమన్నారు . 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోందనీ, ఆసిఫాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 69 వేల 377 జీరో బిల్లులు జారీ చేయడం జరిగిందన్నారు . మొత్తం 69 వేల 377 కుటుంబాలకు ఈ పథకంతో లబ్ది చేకూరుతోంది. ఈ పథకం క్రింద ఇప్పటి వరకు ప్రభుత్వం 10 కోట్ల 9 లక్షల రూపాయల రాయితీ అందజేసిందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం నిత్యం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే , ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్ , జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు , జిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి , వేణు , వివిధ శాఖల ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# దేశానికి ఆదర్శంగా తెలంగాణ






- అన్ని రంగాల్లో అభివృద్ధి
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ
- అదిలాబాద్ కలెక్టరేట్ లో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**ప్రజానావ, అదిలాబాద్ / నేరడిగొండ :** అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తూ అనతికాలంలోనే సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామని ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో షబ్బీర్ అలీ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువిశాల భారతదేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వతంత్ర భారతావనిలో అరవై ఏళ్ళ స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దార్శనిక పాలనలో విద్యుత్, నీటిపారుదుల, వ్యవసాయం, పరిశ్రమలు, ఉద్యోగ ఉపాధి కల్పన, అభివృద్ధి సంక్షేమం తో పాటు ఐటి నుండి అగ్రికల్చర్ వరకు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారంటీలను నిక్కచ్చుగా అమలు చేసి తెలంగాణ ప్రజలకు అభివృద్ధి రాష్ట్రం, సంక్షేమ రాజ్యంగా తీర్చిదిద్దెందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. చివరి వరుసలో పేదలకు కూడా అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో మహాలక్ష్మి, గృహాజ్యోతి, యువ వికాసం, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు వంటి అభయహస్తం గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించామన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన 48 గంటల్లోనే ఆరు గ్యారంటీలలో రెండు హామీలను అమలు చేసి ప్రజల పట్ల తమకు గల అంకితభావాన్ని చాటుకుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలోని ఇంద్రవెల్లి, కేస్లాపూర్ లలో ఫిబ్రవరి 2 న పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారనీ , ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనం అభివృద్ధి పనులకు ఒక కోటి, నాగోబా ఆలయ అభివృద్ధి పనులను 6 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభమై వివిధ దశలలో ఉన్నవన్నారు. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామంలోని 15 మంది అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించడం జరిగిందన్నారు. పరిపాలనను గ్రామాలకు చేర్చాలనే ప్రభుత్వ ఆలోచన మేరకు గత సంవత్సరం డిసెంబర్ 28 నుండి జనవరి 6 వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లాలో 24,635 దరఖాస్తులు స్వీకరించామన్నారు. తెలంగాణ ఆడబిడ్డలను మహాలక్ష్ములను చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం డిసెంబర్ 9, 2023 న లాంఛనంగా ప్రారంభించుకొని, ఇప్పటి వరకు 93 లక్షల 63 వేల 017 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆహార భద్రత కార్డు కలిగిన వారికీ ప్రజాపాలన కార్యక్రమంలో 500 రూపాయల గ్యాస్ సబ్సిడీ క్రింద 96 వేల 115 మంది లబ్ధిదారులు అర్హులు కాగా, ఇప్పటి వరకు ఒక లక్ష 73 వేల 256 ఎల్ పిజి, సిలిండర్ లు సరఫరా చేయబడినవి. ఇందుకు గాను 4.89 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అర్హులైన వినియోగదారులందరికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందించడానికి తెచ్చిన గొప్ప పథకం. జిల్లాలో గృహ జ్యోతి పథకంలో భాగంగా అర్హులైన 95,037 మంది వినియోగదారులకు ఉచిత విద్యుత్ ను అందించడం జరుగుతుందన్నారు .చేయూత క్రింద పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా 5 లక్షల వైద్య సహాయాన్ని 10 లక్షలకు పెంచడం జరిగింది. పేదలందరికి ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు తెచ్చే గొప్ప పథకానికి డిసెంబర్ 9 వ తేదీన శ్రీకారం చుట్టిందని తెలిపారు.రైతు బాగుంటేనే రాష్ట్రం పచ్చగా ఉంటుందని విశ్వసించిన ప్రభుత్వం రైతును రుణవిముక్తుడిని చేసేందుకు రుణమాఫీ చేపట్టడం జరిగింది. జిల్లాలో మూడు విడతలలో ఇప్పటివరకు 55 వేల 879 మంది రైతులకు 608.55 కోట్ల రూపాయలు జమచేయడం జరిగింది. రేషన్ కార్డు లేని రైతు కుటుంబాలను నిర్ధారణ చేయగా మొత్తం 16 వేల 642 రైతులకు గాను ఇప్పటి వరకు 10 వేల 796 మంది రైతులను నిర్ధారణ చేయడం జరిగిందనీ , వ్యవసాయానికి 24 గంటలు నిరంతరం నాణ్యమైన విద్యుత్, నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం, విత్తనాలు బ్లాక్ మార్కెట్ చేస్తే పిడి చట్టం క్రింద కేసులు నమోదు చేయడం జరుగుతుందనీ , అన్నిరకాల పంటల విత్తనాలు సరఫరా చేస్తూ ఎరువుల కొరత లేకుండా రైతులకు సకాలంలో అందిస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్రింద స్వయం సహాయక సంఘాల మహిళలను రాబోయే 5 సంవత్సరాలలో ఆర్థికంగా బలోపేతం చేయుటకుగాను ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 1,793 ఎంటర్ ప్రైజెస్ లు, 19 మీసేవా, 108 ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాలు, 2 మహిళా శక్తి క్యాంటీన్లు, 574 పాడిగేదెల పెంపకం, 2125 పెరటి కోళ్ళ పెంపకం, 17 మదర్ పౌల్ట్రీ, 63 ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్లు, ఉట్నూర్ లో ఒక సంచార చేపల విక్రయ కేంద్రం, జైనథ్ లో ఒక మిల్క్ పాల పదార్థముల విక్రయ కేంద్రము ప్రారంభించడం జరిగింది. 1961 స్వయం సహాయక సంఘాలను గుర్తించి 66,949 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 65,383 దుస్తులను కుట్టి అందించడం జరిగింది తెలిపారు . ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థిని విద్యార్థులకు 28 వేల 246 దుస్తులను కుట్టి పంపిణీ చేయడం జరిగింది. అంగన్వాడీ పిల్లలకు 4171 ఏకరూప దుస్తులుకుట్టి చిన్నారులకు అందించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ ద్వారా శాంతి భద్రతలు పరిరక్షించడమే లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆదిలాబాదు జిల్లాను అన్ని రంగాలలో ప్రజా ప్రతినిధులు , జిల్లా అధికార యంత్రాంగం, ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ, జిల్లా ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



## షబ్బీర్ అలీకు సన్మానం

**ప్రజానావ, ఆదిలాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ కి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం

## సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ



**ప్రజానావ, ఆసిఫాబాద్:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం అని సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. మంగళవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవాల సందర్భంగా పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూస్వాముల, జమీందారుల, జాగిర్దారుల, వెట్టి చాకిరి విముక్తి కోసం మట్టి మనుషులు చేసిన పోరాటంమే తెలంగాణ సాయుధ పోరాటమని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, చాకలి ఐలమ్మ , మద్దుమ్ మొయినుద్దీన్ ,మన జిల్లాలోని కొమురం భీం, రాంజీ గోండు, దాజి శంకర్ కస్తాల రామకృష్ణ, బాసెట్టి గంగారం ,ఇంకా ఎందరో వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. వెట్టిచాకిరి విముక్తి కోసం సాయుధ పోరాటం చేసిన అమరుల స్ఫూర్తితో పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ తిరుపతి, సీపీఐ జిల్లా నాయకులు టి దివాకర్, రాయిల్ల నర్సయ్య, ఆత్మకూరి చిరంజీవి, శంకర్, సుధాకర్, డోన్నాజీ తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల వేతనాలు చెల్లించాలి

**ప్రజానావ, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్, సిర్పూర్ (యు) ఆదర్శం పాఠశాలలో పనిచేస్తున్న కార్మికులకు గత 6 నెలల జీతాలు పెండింగ్ లో ఉన్నాయని వారికి వెంటనే జీతాలు చెల్లించాలని మంగళవారం కేవిపిఎస్, సిఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి ఉదయ్ బాబుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ , సిఐటీయు జిల్లా నాయకులు కృష్ణమాచారి మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా చాలి చాలని వేతనాలతో పని చేస్తున్నారని అన్నారు. ఎస్ఐ, పిఎఫ్ కూడా చెల్లించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు %జ౧%. రేఖ , కవిత , సంగీత తదితరులు పాల్గొన్నారు.

**ప్రజానావ, బెజ్జూర్ :** మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తహసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో భూమేశ్వర్ , మండల అభివృద్ధి కార్యాలయంలో ఇన్చార్జి ఎంపీడీవో గౌరీ శంకర్ , పోలీస్ స్టేషన్లో ఎస్సై విక్రం, పి హెచ్ సిలో వైద్యులు గ్రామ పంచాయతీల్లో కార్యదర్శి, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..





# విశ్వకర్మ జయంతికి ప్రభుత్వ విప్ హాజరు

**ప్రజానావ, వేములవాడ :** విశ్వకర్మ జయంతిని పునస్కరించుకొని వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్ లో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీ విశ్వకర్మ జయంతి మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

# అభివృద్ధి పథంలో ముందంజ

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**ప్రజాపాలనకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరు**



**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల:** స్వతంత్ర్య భారతావనిలో 60 ఏండ్ల స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నదని చెప్పడానికి చాలా సంతోషంగా ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ అమరవీరులకు కలెక్టర్, ఎస్పీలతో కలిసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ నాటి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో ఐక్యమై 76 సంవత్సరాలు పూర్తి చేసుకుని 77 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ రోజును తెలంగాణ ప్రజా పాలన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. 1948 సెప్టెంబర్ 17న సువిశాల భారత దేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వతంత్ర్య భారతావనిలో 60 ఏండ్ల స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నదని చెప్పడానికి చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజల ఆకాంక్షల అనుగుణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిందన్నారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను ప్రభుత్వం ఏర్పాటైన 48 గంటల్లోనే అమలు ప్రారంభించి చరిత్ర సృష్టించిందని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందించే వైద్య చికిత్సల పరిమితిని 10 లక్షల పెంచిందని చెప్పారు.

2 లక్షల వరకూ రుణమాఫీ

తమ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు రూ.2 లక్షల రుణమాఫీ ఇవ్వడంతో రైతులు రుణ విముక్తులై స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారని ఆది శ్రీనివాస్తెలిపారు. ఈ రెండు లక్షల రూపాయల లోపు రుణ మాఫీకి రాష్ట్రంలో 22 లక్షల 22 వేల 67 మంది రైతుల లోన్ అకౌంట్లలో 17 వేల 869 కోట్ల 21 లక్షలు జమ చేసిందని వివరించారు. జిల్లాలో 43 వేల 892 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద రూ. 346 కోట్ల 85 లక్షలు జమ చేశారన్నారు. మహమ్మద్ మైమిన్, నజీం సుల్తానా, గుమ్మడి అభయ్ పటేల్ కు కారుణ్య నియామక పత్రాలను ప్రభుత్వ విప్ అందజేశారు. పరిశ్రమల శాఖ నుంచి టీ ప్రైడ్ కింద ఎస్టీలు 17 మందికి, ఎస్సీ లు 36 మందికి, , ఇద్దరు దివ్యాంగులకు మంజూరు పత్రాలు ప్రభుత్వ విప్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిరిసిల్ల తహసిల్దార్ మొహినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




# ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజానావ, వేములవాడ:** తెలంగాణ ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను మండల విద్యాధికారి బన్నాజీ సోమవారం ఎమ్మార్సీ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదేని సమస్యతో మధ్యంతరంగా పదవ తరగతి, ఇంటర్ ఆగిపోయిన వారికి ఓపెన్ స్కూల్‌లో మళ్లీ చదువుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి ఈ టెక్నో స్కూల్లో ఓపెన్ స్కూల్ కేంద్రం ఉందని, అందులో ప్రభుత్వ నిర్ణీత ఫీజుతో ఓపెన్ టెన్త్, ఇంటర్ లో ప్రవేశాలు జరుగుతున్నాయని వివరించారు. పదో తరగతిలో చేరేందుకు అభ్యర్థులు తాము గతంలో చదివిన తరగతి టిసి లేదా రికార్డు షీట్ తో ప్రవేశం పొందవచ్చని, అవి లేని పక్షంలో తహసిల్దార్ కార్యాలయం నుండి పుట్టిన తేదీ కుల ధ్రువీకరణ పత్రాలను పొంది నేరుగా ప్రవేశాలు తీసుకోవచ్చన్నారు. ఇంటర్ ప్రవేశాలు తీసుకునేందుకు పదవ తరగతి పాస్ అయిన మార్కుల మెమోతో పాటు తహసిల్దార్ కార్యాలయం నుండి తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రంతో ఆధార్ కార్డు జత చేసి ఓపెన్ స్కూల్ కేంద్రంలో ప్రవేశం తీసుకోవచ్చని తెలిపారు. ఓపెన్ స్కూల్ ఏఐ కోఆర్డినేటర్ మహేష్ మాట్లాడుతూ ఆగిన చదువుకు కొనసాగింపుకు ఇదొక చక్కని అవకాశం అని టెన్త్, ఇంటర్ ప్రవేశాల పూర్తి సమాచారం కోసం 9248020207 నంబర్ లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి నగేష్, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో బీఆర్ఎస్ నేతల నిరసన

**ప్రజానావ, వేములవాడ:** బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణకు నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలభిషేకాలు చేయాలని కేటీఆర్ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో శ్రేణులు తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ
- స్వచ్ఛత హి సేవ కార్యక్రమ ఫ్లెక్సీ ఆవిష్కరణ



**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల:** సిరిసిల్ల జిల్లాలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమ ఫ్లెక్సీ ఆవిష్కరించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమం క్రింద చేపట్టాల్సిన కార్యక్రమం షెడ్యూల్ వివరాలను స్వచ్ఛ భారత్ మిషన్ అధికారి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 17 సెప్టెంబర్ నుంచి 02 అక్టోబర్ వరకు ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛత హి సేవ అంశం పై పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, ఆర్ట్ పోటీలు నిర్వహించాలని, పారిశుధ్య నిర్వహణ, ప్రాముఖ్యత పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గ్రామాలలో శ్రమదానం నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, ఆసుపత్రులు, పంచాయతీ భవనాలు మొదలగు ప్రజాసంచార ప్రదేశాలను శుభ్రం చేయాలని, శుక్రవారం డ్రై డే నిర్వహిస్తూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా నాణ్యతను పరిశీలించాలని, పారిశుధ్యంపై ఇంటింటా ప్రచారం నిర్వహించాలని, రోడ్లపై వేసిన చెత్త తొలగింపు, అవసరమైన కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం, తడి చెత్త పొడి చెత్త పై అవగాహన కార్యక్రమాలు, గ్రామ శివారులో చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను శుభ్రం చేయడం, ప్లాస్టిక్ వాడకం పై అవగాహన కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్మికులకు సిబ్బందికి ఆరోగ్య పరీక్షల నిర్వహణ, గాంధీ జయంతి నాడు గ్రామసభలు ఏర్పాటు చేసి స్వచ్ఛభారత్ దినోత్సవం నిర్వహించి పారిశుధ్య సిబ్బందిని సన్మానించాలని కలెక్టర్ తెలిపారు. నిర్దేశించిన షెడ్యూలు తూచా తప్పకుండా పాటించాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని , స్వచ్ఛత హి సేవ కార్యక్రమ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, స్వచ్ఛభారత్ మిషన్ అధికారి సురేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్పీ కార్యాలయంలో..

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ లు కృష్ణ, మొగిలి, ఆర్ఐ లు యాదగిరి, రమేష్, ఎస్ఐ లు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వచ్చే ఐదేండ్లలో కోటి ఇండ్లు : ప్రధాని

**రెండవ దశ పీఎంఏవైఏపీ ప్రారంభం** | **వీసీకి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరు**



**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ రెండో దశను దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుంచిప్రారంభించారు. మంగళవారం జరిగిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిరిసిల్ల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వచ్చే 5 సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో పేదలు మధ్య తరగతి ప్రజలకు కోటి ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా రెండవ దశ ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 అర్బన్ పని చేస్తుందని, 10 లక్షల కోట్ల వ్యయం కలిగిన ఈ ప్రాజెక్టులో ప్రభుత్వం 2 లక్షల 30 వేల కోట్ల సబ్సిడీని అందిస్తుందని ప్రధాని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే పేద మధ్యతరగతి కుటుంబాలు నూతన ఇండ్లు నిర్మాణం, కొనుగోలు, మంచి ధరలకు రెంట్ తీసుకునేందుకు దోహదపడే విధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 ను రూపొందించామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని మురికి వాడలు పూర్తిస్థాయిలో తొలగిపోవాలని లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనిచేయాలని ప్రధానమంత్రి తెలిపారు. సమాజంలోని ఎస్సీ ,ఎస్టీ, మైనారిటీలు, వితంతువులు, దివ్యాంగులు, వీధి వ్యాపారస్తులు అంగన్వాడీ కార్యకర్తలు మొదలగు బడుగు బలహీన వర్గాల ప్రజలు లక్ష్యంగా ఈ కార్యక్రమం అమలు అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎస్డీసీ రాధాభాయ్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీ బేగ్, సంపత్ రెడ్డి, సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్ లో..

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్ లో కమాండెంట్ శ్రీనివాస రావు జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, రాందాస్, ఉదయ్ భాస్కర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీమతి ఇ . ప్రమీల,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# అందరివాడు ఆది సీనన్న

## ప్రతీ నోట ఆది మాట...

## హెూదా మారినా.. అహంలేని నేత

## సామాన్యులకు సీనన్న భరోసా

**ప్రజానావ, సిరిసిల్ల:** పదవి ఉన్నా లేకున్నా ప్రజలతో మమేకమై 14 ఏండ్లుగా ప్రజా నాయకునిగా ప్రస్థానం కొనసాగిస్తున్నాడు. పదవికి ముందే ప్రజల్లో ఉంటా అని ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యేగా గెలిచిన ఏమాత్రం అహం లేకుండా అందరివాడిగా అందరిలో ఒకడిగా ఆది సీనన్న ప్రస్థానం క్రమక్రమంగా పెరుగుతోంది. ఎమ్మెల్యే కాకముందు ఏ విధంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిలో శుభ కార్యాలతో పాటు వివిధ కార్యక్రమాలకు హాజరవుతూ ప్రజలతో మమేకమై, తాను ఒక కుటుంబ సభ్యుడిగా కష్టసుఖాల్లో నేనున్నానంటూ భరోసా కల్పించి, ప్రజల ఆధారాభిమానాలు చూరగొన్న నేత శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత కూడా తన పిలుపులో, ఆప్యాయతలో ఎక్కడా తేడా రానీయకపోవడం ఆయన గొప్పదనం. ఎమ్మెల్యే ఇంటిని చేరాలంటే ఎన్ని ఇక్కట్లు అనుకునే ఎముడాల ప్రజలకు ఎమ్మెల్యే అంటే ఏం జరిగినా బాధలు చెప్పుకొని భరోసా తీసుకోవచ్చని భావన కల్పించిన ఏకైక నాయకుడు అది సీనన్న. పిల్లల నుండి ముదుసలి వరకు ఆయన పేరు సీనన్నగానే చిరస్థాయిగా నిలిచిపోనుంది. ఇక్కడే కాదు అసెంబ్లీ వేదికగా అందరి నోట ఒకే మాట అతి సౌమ్యుడు, స్నేహశీలి, ఆపదలో ఉన్నవారికి అండగా ఉండే నాయకుడు అంటూనే ప్రతిపక్షాల పట్ల పటిష్టమైన వాగ్దాటితో ప్రశ్నించే గొంతుకగా అసెంబ్లీలోని ప్రతి ఒక్కరికి సుపరిచితుడు ఆది సీనన్న. అలనాటి రాముడు పదు నాలుగు ఏండ్ల వనవాస జీవనం తర్వాత ప్రజల క్షేమం కోసం రాజ్యంలోకి రాజ్యాధికారం సాధించిన మాదిరిగానే వేములవాడ



నియోజకవర్గంలో రాముడి తోవలోనే ప్రజల ఓటుతో 14 ఏళ్ల తర్వాత ప్రజా పరిపాలకుడిగా ప్రజల కొరకే తన పదవి అంటూ చెప్పిన ఘనత సీనన్నకే దక్కింది. ప్రజాపాలనను ప్రతి ఒక్కరికి అందించాలని తన గృహాన్ని కార్యాలయంగా మార్చి అర్జీతో వచ్చిన ప్రతి ఒక్కరిని అన్నా అని పలకరిస్తూ అందరికీ సమాధానమిస్తూ సాధ్యమైన మేరకు సమస్య పరిష్కారం కోసం పరితపించే ప్రజా నాయకుడు సీనన్న అనడంలో అతిశయోక్తి లేదు. ఇలాంటి ప్రజా నాయకునికి శ్రీ వేములవాడ రాజరాజేశ్వరుడు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు అష్టైశ్వర్యాలు అందించాలని కోరుతూ ఇవే మా పక్షాన మీకు జన్మదిన శుభాకాంక్షలు.



# ప్రశాంతంగా నిమజ్జనం

## ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ప్రజానావ, వేములవాడ :** సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉత్సవాలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై మానేరు తీరంలో నిమజ్జనాన్ని పరిశీలించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ ఉన్నారు. అలాగే హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేశారు.







# వెళ్లి మళ్లీ రావయ్యా!

- కాగజ్‌నగర్‌లో ప్రశాంతంగా శోభయాత్ర
- భక్తిశ్రద్ధలతో గణనాథుల తరలింపు
- స్థానిక పెద్ద వాగులో నిమజ్జనం
- ఎటు చూసినా భక్తుల కోలాహలం
- పోటాపోటీగా లడ్డు వేలం పాటలు

ప్రజానావ, కాగజ్ నగర్ : గణేష్ నిమజ్జన మహాఘట్టం మంగళవారం ప్రశాంతంగా జరిగింది. 11 రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజించిన గణనాథులను ప్రత్యేక పూజలు నిర్వహించి మేళ తాళాలు మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి పట్టణ సమీపంలోని పెద్దవాగు లో నిమజ్జనం చేశారు. చిన్నారులు, యువతి ,యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జై బోలో గణేష్ మహారాజ్ కి .. జై గణపతి బొప్పా మోరియా అంటూ హెూరెత్తించారు. మండపాల వద్ద లడ్డు ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. అన్నదానాలు ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొంది. అందంగా ముస్తాబు చేసిన వాహనాల్లో గౌరీ తనయుడిని గంగా చెంతకు తరలించారు. అదేవిధంగా కాగజ్ నగర్ లో ఈసారి గణపతి నవరాత్రులు అత్యంత సందడిగా సాగాయి. విద్యుద్దీపకాంతులతో నగర వీధులు దేదీప్యమానంగా వెలిగిపోయింది .గతంతో పోలిస్తే ఎక్కువగా విభిన్న గణపతులు కొలువుతీరాయి. ఇక కాగజ్ నగర్ లో 20 అడుగులతో తయారు చేసిన గణనాధుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.







## బై బై గణపయ్య

ప్రజానావ, సిర్పూర్ టి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో మంగళవారం రోజున భక్తిశ్రద్ధల మధ్య భాజా భజంత్రీలతో యువతీ యువకులు డ్యాన్సులు కేరింతలతో ఘనంగా పోయిరా గణపయ్య అంటూ గణేష్ నిమజ్జనం చేశారు. గణేష్ మండపాల వద్దగణేష్ లడ్డువేలం పాటలో బజరంగ్ దళ్ గణేష్ మండపం గణేష్ లడ్డూ వేలం పాట తంగడపల్లి సంతోష్ , లోన్ వెళ్లియువ గణేష్ వద్ద నిర్వహించిన లక్కీడ్రా లో మొదటి బహుమతి మొబైల్ ఫోన్ బోనగిరి నవీన్ , రెండవ బహుమతి స్ప్రే పంప్ గడిలా మల్లేష్ , లడ్డు వేలం పాట రాకే మారుతి దక్కించుకున్నారు . నిమజ్జనోత్సవానికి ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు .





వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని చైర్ పర్సన్ రామతీర్థం మాధవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సంపత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బింగి మహేష్ ,మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
బుధవారం
18 సెప్టెంబర్ 2024


# బాలపూర్‌ను మించిన రిచ్‌మండ్ విల్లా

## కోటి రూపాయలకు పైగా లడ్డూ వేలం



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 :** గణేశ్ ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు జరిగే తీరు మాత్రం చాలా ప్రత్యేకం ఇక్కడ వి గ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం, లడ్డూ వేలం ఇలా ప్రతి ఒక్క ఘట్టానికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. అందుకే దేశవ్యాప్తంగా ఎన్నెన్ని విగ్రహాలు పెడుతున్నా... అందరి చూపు తెలుగు రాష్ట్రాల వైపు ఉంటుంది. వైవిధ్య మైన విగ్రహాలు ఏర్పాటులోనే కాకుండా లడ్డూ వేలం పాటలో కూడా సరికొత్త రికార్డులు సృష్టిస్తూ టాక్‌ఆఫ్‌ది కంట్రీగా నిలుస్తున్నాయి. అలాంటి వాటిలో టాప్ ప్లేస్ లోనే నిలిచటింది కీర్తి రిచ్‌మండ్ విల్లాస్ గణేషుడు. హైద రాబాద్‌లోని బండ్లగూడ జాగీర్‌లో ఉంది కీర్తి రిచ్‌మండ్ విల్లా. అక్కడ ఏటా భారీ ధరకు లడ్డూ వేలం పాట నిర్వహిస్తుంటారు. ఇక్కడ ఉన్న వాళ్లంతా ధనవంతులు కావ డంతో లడ్డూ వేలం కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది. ఈ సంవత్సరం కూడా ఆ స్థాయికి ఏ మాత్రం తగ్గన ట్టుగా వేలం పాట జరిగింది. కోటి రూపాయలకు పైగానే వేలం పాడినట్లు సమాచారం.



## ముంబై కొత్త కెప్టెన్‌గా
# సూర్యకుమార్!


ముంబై ఇండియన్స్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్టుగా నిలిచింది. రోహిత్ శర్మ కెప్టెన్సీలో ముంబై జట్టు 5 ఐపీఎల్ ట్రోఫీలు గెలుచుకుంది. అయితే, ఐపీఎల్ 2024లో ముంబై ఇండియన్స్ దారుణ పరిస్థితులు ఎదుర్కొంది. ఇదే క్రమంలో హార్దిక్ పాండ్యాను ముంబై ఇండియన్స్ జట్టులోకి తీసుకొచ్చి, కెప్టెన్‌గా చేశారు. అదే సీజన్‌లో ముంబై ఫ్లాప్ అయింది. గత సీజన్‌లో జరిగిన తప్పులను సరిదిద్దుకొని పాత వైభవం తీసుకరావాలని ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ కోరుకుంటోంది. ఈ క్రమంలో ఐపీఎల్ 2025 మెగా వేలంలో కొత్త ఆటగాళ్లను తీసుకునేందుకు కసరత్తులు మొదలుపెట్టింది. దీంతో ప్రస్తుతం ఉన్న జట్టులో కీలక మార్పులు చేసేందుకు రెడీ అవుతోంది. ఈ క్రమంలో ముంబై జట్టులో 3 కీలక మార్పులు చేయనుంది. రోహిత్ శర్మ ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ముంబై ఇండియన్స్‌కు దూరమయ్యే ఛాన్స్ ఉంది. ముంబై కెప్టెన్‌గా తనను తొలగించి పాండ్యాను ఎన్నుకోవడం.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ముంబైకి ఇదే చివరి సీజన్ అంటూ చెప్పడంతో ఈ వార్తలకు బలం చేకూరింది. అయితే, వీటిపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రోహిత్ శర్మ ముంబై ఫ్రాంచైజీని వీడితే.. లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వంటి జట్లు హిట్‌మ్యాన్‌ను దక్కించుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని నెలల్లో ఏం జరగనుందో తెలియాల్సి ఉంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తన సారథిని మరోసారి మార్చే అవకాశం ఉందంటూ వార్తల వస్తున్నాయి. టీ20 ఫార్మాట్‌కు ఇప్పటికే కెప్టెన్‌గా పనిచేసిన సూర్యకుమార్ యాదవ్ ముంబై కెప్టెన్సీ రేసులో ముందున్నాడు. గత సీజన్‌లో ముంబై కెప్టెన్‌గా హార్దిక్ ఘోరంగా విఫలమవ్వడంతో.. ఈ ఏడాది కెప్టెన్సీలో మార్పు అంశం బయటకు వచ్చింది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ ఇద్దరూ ముంబై జట్టును వీడితే.. నూతన కెప్టెన్‌గా టీమ్ ఇండియా స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ముంబై కెప్టెన్‌గా మారే ఛాన్స్ ఉంది. అయితే, ఇందుకు చాలా తక్కువ ఆస్కారం ఉంది. సూర్య ముంబైకి అందుబాటులో లేకపోతే.. జస్‌ప్రీత్ బుమ్రా ముంబై క్యాంప్ జట్టుకు కెప్టెన్ అయ్యే ఛాన్స్ ఉంది.



# అర్జున్ టెండుల్కర్ అద్భుత బౌలింగ్

ఇండియన్ క్రికెట్ గాడ్ సచిన్ టెండుల్కర్ కొడుకు అర్జున్ టెండుల్కర్ అద్భుతమైన బౌలింగ్‌తో అదరగొట్టాడు. కెప్టెన్ కె తిమ్మప్పయ్య మెమోరియల్ ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నమెంట్ లో దుమ్మురేపాడు. అతడి బౌలింగ్ దాటికి ప్రత్యర్థి బ్యాటర్లు ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయారు. ఇక ఈ టోర్నీలో గోవాకు అర్జును ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. కాగా.. లేటెస్ట్ గా కర్ణాటకతో జరిగిన మ్యాచ్ లో 9 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అర్జున్ పేస్ బౌలింగ్ ముందు కర్ణాటక ప్లేయర్లు నిలవలేక పోయారు. ఈ మ్యాచ్ కు సంబంధించి మరిన్ని వివరాల్లోకి వెళితే..ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో సచిన్ కొడుకు అర్జున్ టెండుల్కర్ చెలరేగిపోయాడు. తన పదునైన పేస్ బౌలింగ్ తో జట్టుకు తిరుగులేని విజయాన్ని అందించాడు. ఈ టోర్నీలో భాగంగా గోవాకు ఆడుతున్న అర్జున్.. ఆతిథ్య కర్ణాటకతో జరిగిన మ్యాచ్ లో ఏకంగా 9 వికెట్లతో ఘనత వహించాడు. ఈ మ్యాచ్ లో తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టగా.. రెండో ఇన్నింగ్స్ లో 4 వికెట్లతో సత్తా చాటాడు. ఓవరాల్ గా 26.3 ఓవర్లు వేసి 87 రన్స్ ఇచ్చి 9 వికెట్లు నేలకూల్చాడు. అర్జున్ బౌలింగ్ దాటికి కర్ణాటక బ్యాటర్లు ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయారు. కొద్దిసేపు కూడా క్రీజ్ లో నిలవలేకపోయారు. సచిన్ కొడుకు అద్భుతమైన బౌలింగ్ చేయడంతో.. ఇన్నింగ్స్ 189 పరుగుల తేడాతో గోవా టీమ్ ఘన విజయం సాధించింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక తొలి ఇన్నింగ్స్ లో 103 పరుగులకు ఆలౌట్ కాగా.. అర్జున్ 13 ఓవర్లు వేసి 41 రన్స్ ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం గోవా తమ ఫస్ట్ ఇన్నింగ్స్ లో 413 పరుగులు చేసింది. అభినవ్ తేజ్ రానా(109) సెంచరీతో కదం తొక్కాడు. ఇక రెండో ఇన్నింగ్స్ లో కూడా కర్ణాటక బ్యాటర్లు దారుణంగా విఫలం అయ్యారు. దాంతో 121 రన్స్ కే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. రెండు ఇన్నింగ్స్ ల్లో కూడా అర్జున్ బౌలింగ్‌ను ఆడలేకపోయిన కర్ణాటక టీమ్ ఓడిపోయింది. కాగా.. ఇప్పటి వరకు సీనియర్ లెవెల్లో 49 మ్యాచ్ లు ఆడి.. 68 వికెట్లు పడగొట్టాడు. అలాగే 13 ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ల్లో 21 వికెట్లు తీశాడు.

# భారీగా పెరిగిన టీ20 ప్రపంచకప్ ప్రైజ్ మనీ



ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ ప్రైజ్ మనీని ప్రకటించింది. టీ20 ప్రపంచకప్ గెలిస్తే మహిళలకు పురుషులతో సమానంగా ప్రైజ్ మనీ లభిస్తాయన్నది పెద్ద వార్త. మహిళల టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన జట్టుకు ఇప్పుడు 23 లక్షల 40 వేల యూఎస్ డాలర్లు అంటే రూ.19 కోట్ల 59 లక్షలు అందజేయనున్నట్లు ఐసీసీ ప్రకటించింది. టీ20 ప్రపంచకప్ 2024లో ఛాంపియన్‌గా నిలిచినందుకు టీమ్ ఇండియాకు ఇంత మొత్తం వచ్చింది. టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రి కాపై టీమిండియా ఘన విజయం సాధించింది. మహిళల టీ20 ప్రపంచకప్ అక్టోబర్ 3 నుంచి ప్రారం భం కానుంది. ఈ టోర్నీ బంగ్లాదేశ్ నుంచి యూఏఈకి మారింది. మహిళల టీ20 ప్రపంచ కప్ 2024 టోర్నమెంట్ అని ప్రకటించింది. దీనిలో మహిళలు పురుషులతో సమానంగా ప్రైజ్ మనీని అందుకుంటారు. ఇది ఆట చరిత్రలో ఒక ముఖ్యమైన విజయం. గత మహిళల టీ20 ప్రపంచకప్ విజేతకు 1 మిలియన్ అమెరికన్ డాలర్లు అందాయి. పురుషుల, మహిళల టీ20 ప్రపంచ కప్ రెండింటికీ సమాన మ్యాచ్ ఫీజును కలిగి ఉండాలనే నిర్ణయం జులై 2023లో తీసుకున్నారు. తన వార్షిక సమావేశంలో ప్రైజ్ మనీని గతంలో షెడ్యూల్ చేసిన 2030 షెడ్యూల్ కంటే ఏడేళ్ల ముందు సమానంగా చేయాలని నిర్ణయించింది. ప్రపంచ కప్‌లో పురుషులు, మహిళలకు సమాన ప్రైజ్ మనీని కలిగి ఉన్న మొదటి ప్రధాన క్రీడగా క్రికెట్ అవతరించింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన జట్టుకు 23 లక్షల 70 వేల డాలర్లు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు 11 లక్షల 70 వేల డాలర్ల ప్రైజ్ మనీ లభిస్తుంది. గతేడాది రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా జట్టు ఐదు లక్షల డాలర్లు అందుకుంది. ఈ విధంగా కూడా 134 శాతం పెరిగింది. మహిళల ప్రపంచ కప్ సెమీ-ఫైనల్స్‌లో ఓడిపోయిన జట్లకు ఇప్పుడు 675,000 అందజేయనుంది. ఇది 2023లో 210,000 నుంచి పెరిగింది. ఈ విధంగా, టోర్నమెంట్ మొత్తం ప్రైజ్ మనీ 7,958,080 అవుతుంది. ఇది గత సంవత్సరం మొత్తం 24 లక్షల 50 వేల కంటే 225 శాతం ఎక్కువ. మహిళల టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్ స్టేజ్ నుంచి ఎలిమినేట్ అయిన జట్లకు 31,154 డాలర్లు, సెమీఫైనల్‌కు చేరుకోలేకపోయిన ఆరు జట్లకు వారి తుది స్థానాల ఆధారంగా మొత్తం 13 లక్షల 50 వేల ప్రైజ్ మనీ లభిస్తుంది.

# ట్రిపుల్ సెంచరీకి చేరువలో కుల్దీప్ యాదవ్!



చెన్నై వేదికగా సెప్టెంబర్ 19 నుండి భారత్, బంగ్లాదేశ్ మధ్య మొదటి టెస్ట్ ప్రారంభం కానుంది. స్పిన్‌కు స్వర్గధామమైన చెన్నై పిచ్‌పై స్పిన్నర్లు చెలరేగనున్నారు. ఈ క్రమంలో భారత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అరుదైన రికారుపై కన్నేశాడు. చెన్నై టెస్ట్‌లో కుల్దీప్ మరో ఆరు వికెట్లు తీస్తే.. అంతర్జాతీయ క్రికెట్‌లో 300 వికెట్ల మైలురాయిని అందుకుంటాడు. ఇప్పటివరకు 12 టెస్ట్‌ల్లో 53, 106 వన్డేల్లో 172, 40 టీ20ల్లో 69 వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ టెస్ట్‌ల్లో 4, వన్డేల్లో 2, టీ20ల్లో 2 సార్లు ఐదు వికెట్ల ఘనతలు సాధించాడు. టెస్ట్, వన్డేల్లో ఇది సాధ్యమే అయినా.. టీ20ల్లో ఐదు వికెట్స్ ఘనత సాధించడం మాములు విషయం కాదు. అందులోనూ రెండుసార్లు ఈ ఘనత అందుకున్నాడు. అంతేకాదు ఈ చైనామన్ స్పిన్నర్ రెండు వన్డే హ్యాట్రిక్‌లు కూడా తీశాడు?. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (953) ఉన్నాడు. భారత్ తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో 300 వికెట్ల మార్కును 12 మంది దాటారు. కుల్దీప్ 13వ బౌలర్‌గా నిలవనున్నాడు.

## తొలి విజయం కోసం
# ఎదురుచూస్తోన్న బంగ్లా



భారత్, బంగ్లాదేశ్ మధ్య టెస్టు సిరీస్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. గురువారం (సెప్టెంబర్ 19) నుంచి ప్రారంభం కానున్న ఈ సిరీస్ ఇరు జట్లకు ఎంతో కీలకం.ఎందుకంటే, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు ఫైనల్ చేరాలంటే ఈ సిరీస్‌ను తప్పక గెలవాలి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో బంగ్లాదేశ్ ఫైనల్ రేసులో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాలి. దీంతో ఈ సిరీస్‌లో ఇరు జట్ల నుంచి తీవ్ర పోటీ నెలకొనే అవకాశం ఉంది.గణాంకాల ప్రకారం ఇక్కడ భారత జట్టు అత్యంత పటిష్టంగా ఉంది. ఎందుకంటే బంగ్లాదేశ్‌తో టీమిండియా మొత్తం 13 టెస్టు మ్యాచ్‌లు ఆడింది. ఈ క్రమంలో భారత జట్టు 11 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. బంగ్లాదేశ్ జట్టు ఇప్పటి వరకు భారత్‌పై ఒక్క టెస్టు మ్యాచ్ కూడా గెలవలేదు. అయితే 2 మ్యాచ్‌ల్లో డ్రా చేసుకోగలిగింది. తద్వారా భారత్‌తో సిరీస్‌ను డ్రా చేసుకోగలిగితే బంగ్లాదేశ్ జట్టుకు అది గొప్ప విజయం అవుతుంది. భారత్, బంగ్లాదేశ్‌లు చివరిసారిగా 2022లో టెస్టు సిరీస్ ఆడాయి. ఈ రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 2-0 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, ఇక్కడ గమనించాల్సిన ప్రధాన అంశం ఏమిటంటే.. చివరి టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు ఉత్కంఠ విజయం సాధించింది. అంటే బంగ్లాదేశ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు 227 పరుగులు చేయగా, భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 314 పరుగులకు ఆలౌటైంది.రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ జట్టు 231 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో 145 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా 7 వికెట్లు కోల్పోయింది. దీంతో 3 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఈ సిరీస్‌లోనూ ఉత్కంఠ భరిత పోరును ఆశించవచ్చు.



# ఐదోసారి ఛాంపియన్స్ ట్రోఫీ భారత్ కైవసం

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ 2024 ఫైనల్ మ్యాచ్ ఆతిథ్య చైనా, భారత్ మధ్య జరిగింది. భారత జట్టు ఆరోసారి ఫైనల్ ఆడుతుండగా, చైనాకు ఇది తొలి ఫైనల్. చైనా జట్టు తొలిసారి టైటిల్‌ను చేజిక్కించుకోవాలని ప్రయత్నించి టీమ్‌ఇండియాకు గట్టి పోటీనిచ్చింది. ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత హాకీ జట్టు మరోసారి తన సత్తాను చాటుకుంది. భారత హాకీ జట్టు 1-0తో చైనాను ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆసియా ఛాంపియన్‌షిప్ 2024 ఫైనల్‌లో, నాల్గవ క్వార్టర్‌లో మొదటి గోల్ చేయడం ద్వారా భారత హాకీ జట్టు చైనాపై 1-0 ఆధిక్యాన్ని సాధించింది. నాలుగో క్వార్టర్ 7వ నిమిషంలో జుగ్‌రాజ్ సింగ్ భారత్ తరపున ఈ గోల్ చేశాడు. ఈ విధంగా మూడు క్వార్టర్ల తర్వాత ఒక గోల్ చేసి భారత్ ఫైనల్‌లో ముందంజ వేసింది. ఫైనల్ మ్యాచ్‌లో భారత్, చైనాల మధ్య మూడు క్వార్టర్ల పాటు టై అయినప్పటికీ, నాలుగో క్వార్టర్ 7వ నిమిషంలో జుగ్రాజ్ సింగ్ అద్భుతమైన పాస్‌ను గోల్‌గా మలిచి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. దీని తర్వాత నాలుగో క్వార్టర్ మిగిలి ఉన్న సమయంలో టీమిండియా ఆటగాళ్లు చైనాకు పునరాగమనానికి అవకాశం ఇవ్వలేదు. తద్వారా భారత హాకీ జట్టు ఐదోసారి ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. చైనాకు రజత పతకం దక్కనుంది. 2024 ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ టోర్నీలో భారత జట్టు తన సత్తాను చాటింది. గతంలో భారత్ 2011, 2016, 2018, 2021లో ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ టైటిళ్లను గెలుచుకుంది. ఇప్పుడు 2024లో జరిగిన ఈ టోర్నీని గెలుచుకోవడం లో జట్టు విజయం సాధించింది. అయితే 2016 టోర్నీలో భారత్, పాకిస్థాన్ సంయుక్తంగా గెలిచాయి. ఈ టోర్నీలో అత్యంత విజయవంతమైన రెండో జట్టు పాకిస్థాన్, మూడుసార్లు టైటిల్ గెలుచుకోవడంలో విజయం సాధించింది. ఈసారి పాకిస్థాన్ జట్టు కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. చైనా జట్టు తొలిసారి ఫైనల్ చేరి రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
10
బుధవారం
18 సెప్టెంబర్ 2024

# వినాయక నిమజ్జనంలో విషాదం

## చెరువులో పడి యువకుడి మృతి



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 17 :** వినాయకుడి నిమజ్జనం లో విషాదం చోటు చేసుకుంది. చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ విషాదకరస సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండ లం జిబ్లక్ పల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు గణెళిషుడిని చెరువులో నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు చెరువు లో జారి పడి మృతి చెందాడు. ప్రవీణ్ మృతదేహం వెలికి తీసేందుకు చర్యలు ప్రారంభించారు.



# రెమ్యునరేషన్ పెంచేసిన యానిమల్ బ్యూటీ

చాలా రోజులుగా సోషల్ మీడియాను షేక్ చేస్తున్న భామల్లో టాప్‌లో ఉంటుంది తృప్తి డిమ్రి. యానిమల్ సినిమాలో అందాలు ఆరబోసి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ బ్యూటీ అతి తక్కువ కాలంలోనే బాలీవుడ్‌లో వన్ ఆఫ్ ది బిజీయెస్ట్ హీరోయిన్‌గా మారిపోయింది. మరోవైపు బ్యాడ్ న్యూజ్ కూడా మంచి వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు బీటౌన్ దర్శక నిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.ఇదిలా ఉంటే ఈ భామ తన రెమ్యునరేషన్‌ను భారీగా పెంచేసిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం తృప్తి డిమ్రి రూ.6 కోట్ల నుంచి 10 కోట్లకు పెంచేసిందని ఇన్‌సైడ్ టాక్. కాగా తృప్తి డిమ్రి సక్సెస్ వేవ్‌లో దూసుకెళ్తుండటంతో రెమ్యునరేషన్‌ను అమాంతం పెంచేసిందన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తృప్తి డిమ్రి ఖాతాలో భూల్ భులయ్యా 3, ధడక్ 2, సినిమాలున్నాయి. వీటితోపాటు పలు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.



# కాంచన సీరిస్‌లో పూజా హెగ్డే పేరు పరిశీలన

దర్శక నటుడు, నిర్మాత రాఘవ లారెన్స్ కథానాయకుడిగా వచ్చిన 'కాంచన' సిరీస్‌లో భాగంగా త్వరలో నాలుగో భాగం తెరకెక్కనుంది. ఇందులో హీరోయిన్‌గా బుట్టబొమ్మ పూజా హెగ్డేను తీసుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకవైపు ఇతర దర్శకులతో కలిసి పనిచేస్తున్న రాఘవ లారెన్స్.. మరోవైపు 'కాంచన-4' స్క్రిప్టును కూడా సిద్ధం చేసుకున్నారు. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కించాలని ఆయన నిర్ణయించారు. దీనికి అనుగుణంగానే ఈ స్టోరీ విన్న తర్వాత గోల్డ్‌మైన్స్ నిర్మాణ సంస్థ ముందుకు వచ్చింది. దీంతో ఈ సంస్థతో కలిసి రాఘవ లారెన్స్ కాంచన నాలుగో భాగాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. గత మూడు చిత్రాల తరహాలోనే నాలుగో భాగాన్ని కూడా ప్రేక్షకులను అలరించేలా కథను సిద్ధం చేశారు. ఈక్రమంలో ముందుగా మృణాల్ ఠాకూర్, మాళవిక మోహనన్ పేర్లు వినిపించినప్పటికీ తాజాగా హీరోయిన్‌గా పూజా హెగ్డేను తీసుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, గోల్డ్‌మైన్స్ నిర్మాణ సంస్థ అనేక తమిళ హిట్ చిత్రాలను హిందీలోకి అనువాదం చేసి విడుదల చేసింది. లారెన్స్ ప్రస్తుతం నటిస్తోన్న హంటర్ చిత్రాన్ని కూడా ఈ సంస్థే నిర్మిస్తుండడం గమనార్హం.

# రజనీ స్టైల్‌కు భిన్నంగా వేట్టయాన్

## రోజురోజుకూ పెరుగుతున్న అంచనాలు

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ హీరోగా టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'వేట్టయాన్' అక్టోబర్ 10న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తాజాగా దీనిపై సంగీత దర్శకుడు అనిరుధ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఈ చిత్ర నేపథ్యం గురించి చెప్పారు. ఇప్పటికే రానా ఈ చిత్రంపై చేసిన కామెంట్స్ అంచనాలు పెంచగా.. తాజాగా అనిరుధ్ చేసిన వ్యాఖ్యలు వాటిని రెట్టింపు చేసి రజనీ ఫ్యాన్స్‌లో జోష్ నింపుతున్నాయి. 'వేట్టయాన్' పవర్‌ఫుల్ కథతో రానుంది. దీని స్క్రిప్ట్ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. రజనీ ఈ కథకు మరింత బలాన్నిచ్చారు. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులు ఇందులో కొత్త రజనీకాంత్‌ను చూస్తారు. ఇప్పటివరకు ఆయన చేసిన సినిమాలన్నిటికంటే ఇది వైవిధ్యంగా ఉంటుంది. సామాజిక అంశాలు, వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని తెరకెక్కించారు. సూపర్ స్టార్ గత చిత్రం 'జైలర్'తో పోలిస్తే ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది' అని అనిరుధ్ చెప్పారు. ఈ చిత్రం గురించి గతంలో రానా మాట్లాడుతూ.. ఇది రజనీస్టైల్ సినిమా కాదని.. ఆయన ఇమేజ్‌కు పూర్తి భిన్నమైన చిత్రాన్ని మొదటిసారి ఎంపిక చేసుకున్నారని తెలిపారు. దీంతో ప్రేక్షకుల్లో దీనిపై ఆసక్తి నెలకొంది. ఈ సినిమా విషయానికొస్తే.. 'జై భీమ్' విజయం తర్వాత టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. అమితాబ్, ఫహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయన్ కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం 'కూలీ'లోనూ రజనీ నటిస్తున్నారు.





# పుష్ప రికార్డును దాటిన దేవర

## ఎన్టీఆర్‌కు విషెస్ చెప్పిన నటుడు సుమన్

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దేవర' భారీ అంచనాల మధ్య ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. విడుదలకు ముందే ప్రీ సేల్‌లో పలు రికార్డులు సృష్టించిన ఈ సినిమా గురించి తాజాగా నటుడు సుమన్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఎన్టీఆర్ ఎంతో అదృష్టవంతుడు. విడుదలకు ముందు ఇన్ని రికార్డులు సాధించడమంటే మాటలు కాదు. అందరి నటులకు ఇది సాధ్యం కాదు. స్టోరీ, దర్శకుడు, టీమ్ వల్ల కూడా 'దేవర'కు క్రేజ్ ఏర్పడింది. ఎన్టీఆర్ చిన్నప్పటినుంచి క్లాసికల్ డ్యాన్సర్. అందుకే ఆయన ఏ డ్యాన్స్ వేసినా గ్రేస్ ఉంటుంది. డైలాగ్స్ చెప్పడం తారక్‌కు చిన్నప్పటి నుంచి అలవాటే. వాటిలో ఆయన మాస్టర్. అలాగే ఫైట్స్‌పై కూడా ఆయనకు మంచి అవగాహన ఉంది. ఆర్టిస్ట్‌గా తెరపై ఏం చేయాలనే విషయం తారక్‌కు బాగా తెలుసు. ఎంతో అంకితభావం, నిబద్ధత ఉన్న వ్యక్తి. అందరితో చాలా స్నేహపూర్వకంగా ఉంటారు. ప్రతీ సన్నివేశాన్ని టీమ్‌తో చర్చిస్తారు. సలహాలు, సూచనలు ఇస్తారు. ఆయనతో కలిసి మరోసారి వర్క్ చేసేందుకు ఎదురుచూస్తున్నా. 'దేవర'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇది మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా అంటూ చిత్రబృందానికి సుమన్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇప్పటికే పలు రికార్డులు తన ఖాతాలో వేసుకున్న 'దేవర'. తాజాగా మరోసారి సత్తా చాటింది. బుక్‌మైషోలో.. 'పుష్ప2'ను దాటేసింది. ఈ రెండు సినిమాలు చూడడానికి ఎంతమంది ఆసక్తి చూపుతున్నారో తాజాగా బుక్ మై షో విడుదల చేసింది. అందులో ఇప్పటివరకు 'పుష్ప2' కోసం 3 లక్షల 34వేల మంది ఆసక్తి కనపరచగా.. 'దేవర' కోసం 3 లక్షల 36వేల మంది ఎదురుచూస్తున్నారు. 'దేవర' విషయానికొస్తే.. 'జనతా గ్యారేజ్' తర్వాత హీరో ఎన్టీఆర్- డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రమిది. జాన్వీ కపూర్ ఈ మూవీతోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు.

Printed, Published and Owned by **Adula Thirupathi**, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**